## మెరుగైన సమాజం కోసం

సురాజ్య ఉద్యమం

# సురాజ్యం నిర్మిద్దాం

డా॥ జయప్రకాష్ నారాయణ్

# మెరుగైన సమాజం కోసం

సురాజ్య ఉద్యమం

# 'సురాజ్యం' నిర్మిద్దాం

డా॥ జయప్రకాష్ నారాయణ్

# పునఃసమీక్షకు సమయం

"ఏ సమాజంలో అయితే నీతి తప్పినవారు విజయం సాధిస్తారో
ఎక్కడైతే నేరస్తులు ఆరాధ్యులుగా మారతారో
ఎక్కడైతే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో
ఎక్కడైతే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా
'తమకు కావలసిన' వాటా కోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో

అక్కడ

వ్యవస్థకు సంబంధించిన పునఃసమీక్షకు
సమయం ఆసన్నమైందని అర్థం
అప్పుడు తమ గురించి, తమకు సంబంధించినవారి గురించి
తమ చుట్టూరా వున్న వారి గురించి
తమ కార్యకలాపాలకు సంబంధించి
అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి"

– రాబర్ట్ క్లిట్‌గార్డ్
ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త

**FDR and Lok Satta publication**
**2012, Hyderabad**

**H.No. 806, 8th Floor, Srinivasa Towers,**
**Beside ITC Kakatiya Hotel, Begumpet, Hyd-16**
**Ph: +91-40-2341 9949, Fax: +91-40-2341 9948**
**Email : info@fdrindia.org**
**Web : www.fdrindia.org**

# 'సురాజ్యం' నిర్మిద్దాం

స్వాతంత్ర్యానంతర కాలంలో కొంత మేరకి అభివృద్ధిని సాధించుకుంటున్నాం. కాని నాయకులు మారినా, ప్రభుత్వాలు కుప్పకూలినా పాలనపేరుతో దోపిడి పెరిగిపోతున్నది. మన జాతీయ పోరాటనేతలు స్వరాజ్యన్ని గూర్చి ఎన్నో కలలు కన్నారు. కాని కాలక్రమేణా మన స్వరాజ్యం కొంత మంది 'స్వాహారాజ్యం' గా మారిపోయింది. కేవలం తెల్లదొరలని సాగనంపి, తరచు ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చగానే స్వరాజ్యం వచ్చిందనుకుంటే అది భ్రమే. ఈరోజు దేశమంతటా అధికారాన్ని, రాజకీయాన్ని, పాలనని చూస్తే మూడు రీతులు స్పష్టంగా కానవస్తున్నాయి.

**మొదటిది:** రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి, పాలనలో అంతులేని దోపిడీకి పాల్పడుతున్నారు. పార్టీలు కొందరి వ్యక్తుల, కుటుంబాల స్వంత ఆస్తులుగా మారిపోయాయి. సభ్యులు కేవలం పల్లకీలు మోసే బోయీలుగా, జెండాలు పట్టే కూలీలుగా, అధికారంలో ఉన్న వాళ్ళకి లొంగి ఉండే బానిసలుగా మారిపోయారు. పార్టీలలో పదవులు కేవలం అధినాయకుల అండ ఉన్న కొంతమందికి స్వంతం; నాయకత్వం కుటుంబ వారసత్వంగా సంక్రమించే హక్కు. అక్రమార్జన ద్వారా సేకరించిన డబ్బులో కొంత భాగం ఎన్నికలలో పెట్టుబడిగా పెట్టటం, బలవంతంగానో, ప్రలోభాలతోనో డబ్బులు సేకరించి ఖర్చుపెట్టటమే నిధుల వినియోగం. ఇక పార్టీ తరపున పోటీ చేసేవాళ్ళు కేవలం రాజకీయ వ్యాపారంలో భాగస్వాములు. ఓటు పొందాలంటే నోట్లతో కొనుక్కోవటం, సారాయి మత్తులో ముంచి లొంగదీసుకోవటం ఈనాటి సంప్రదాయ రాజకీయానికి ఆనవాయితీ అయింది. ఒకసారి పదవుల్లోకి వచ్చేక పెట్టిన పెట్టుబడికి పది, వంద రెట్లు ఆర్జించటమే రాజకీయం లక్ష్యం. ఈ అక్రమార్జన కోసం కాంట్రాక్టులలో కమీషన్లు, లైసెన్సులలో ముడుపులు, బదిలీలకి లంచాలు, పోలీసు కేసుల్లో పైరవీలు, భూముల కబ్జాలు, ప్రాజెక్టులలో వాటాలు, ప్రతిపనికి ఆమ్యామ్యాలు. ఇవన్నీ మన రాజకీయంలో, పాలనలో అంతర్భాగమయ్యాయి. చట్టాన్ని, రాజ్యాంగాన్ని నిలబెట్టవలసిన రాజకీయం వాటిని తుంగలోకి తొక్కుతున్నది. గూండాలు స్వైరవిహారం చేస్తున్నారు; నేరస్తులు నాయకులుగా చెలామణీ అవుతున్నారు. ఇలా అక్రమార్జన, రాజకీయంలో నేరప్రవృత్తి, అవినీతి,

దుష్పరిపాలన, అధికార దుర్వినియోగం, అమాయకులకి అడుగడుగునా అన్యాయం ఇవన్నీ విడదీయనంతగా కలిసిపోయాయి. డబ్బు పంపిణీ, మద్యం సరఫరా లేకుండా, అక్రమార్జన లేకుండా, అసలు రాజకీయం సాధ్యమే కాదనే పరిస్థితిని ఈనాటి సంప్రదాయ పార్టీలు కావాలని సృష్టించాయి. స్వరాజ్యాన్ని స్వాహారాజ్యంగా మార్చాయి. గొర్రెలని తినేవాడు పోతే బర్రెలు తినేవాడు వస్తాడనే చందాన రాజకీయాన్ని తయారు చేశాయి.

**రెండవది:** ఒకవేళ ప్రజలంతా తాము కోల్పోతున్నదేమిటో తెలుసుకుని, డబ్బుకి, మద్యానికి లోబడకుండా ఓటేస్తారేమో. ఈ భయంతో సంప్రదాయ రాజకీయం సమాజాన్ని కులం, మతం, భాష ప్రాంతం పేరుతో చీల్చటం, విభజించి పాలించడం నేర్చుకున్నది. జాతీయతని, పౌరసత్వాన్ని విస్మరించి ప్రజల మధ్య ద్వేషాన్ని, అసూయని రగల్చటం ఈ దివాళాకోరు రాజకీయానికి అవసరం. కులం పేరుతో రెచ్చగొట్టటం, మతం పేరుతో ద్వేషాన్ని నింపటం, ప్రాంతం పేరుతో ప్రజలని విడగొట్టటం ఎన్నో వైవిధ్యాలున్న ప్రాచీన సమాజంలో చాలా సులువు. ఇలాంటి కృత్రిమ అడ్డుగోడల్ని నిర్మించి సమాజాన్ని సంకుచితం చేస్తే, పాలకుల అన్యాయాన్ని ఎదిరించే శక్తి పౌరులకుండదు. ముక్కలయిన సమాజంలో ఎన్నికయిన వాడి అవినీతిని గాని, అధికారి దుర్మార్గాన్ని గాని ప్రశ్నించటం కష్టం. ఏం చేసినా 'మనవాడే గదా' అనే తత్వం ఉన్నప్పుడు దోపిడీకి గురవుతున్న వాళ్ళు మౌనంగా అన్యాయాన్ని భరించాల్సిందే. మన 'స్వరాజ్యం' లో సంప్రదాయ రాజకీయం ప్రజలని ఇలా విభజించి పబ్బం గడుపుకోవటంలో ఆరితేరింది. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలని కాపాడటం, సంకుచితత్వాన్ని తొలగించి అందరినీ సమన్వయం చేయటం సరైన స్వరాజ్యంలో రాజకీయం చేయవలసిన పని. కాని స్వాహారాజ్యంలో, సంకుచిత రాజకీయం పని ప్రజలలో అనుక్షణం విభేదాలని సృష్టించి పబ్బం గడుపుకోవటం.

**మూడవది:** రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి ఓట్లని డబ్బుతో, ప్రలోభాలతో, సారాయితో కొన్నా, సమాజాన్ని చీల్చి ప్రజలని విభజించినా, ఎప్పుడో ఒకప్పుడు తమ జీవితాలు బాగుపడాలన్న కోర్కె సామాన్యులకి కలిగితే స్వాహారాజ్యం ప్రమాదంలో పడుతుంది. అలాంటి ప్రమాదం లేకుండా ఉండాలంటే ప్రజలని తాత్కాలిక తాయిలాలతో తృప్తి పరచాలి. అందుకే తాత్కాలిక రాయితీలతో ఓటర్లని మభ్యపెట్టటం ఈనాటి రాజకీయంలో అనవాయితీ అయ్యింది. బీదరికాన్ని తొలగించి ప్రజలని వారి

కాళ్లమీద వారు నిలబడేలా చెయ్యాలంటే మంత్రదండాలు, తాయెత్తులతో ఫలితాలు రావు. అందరికీ మంచి ప్రమాణాల విద్య, ప్రతి కుటుంబానికి మంచి ఆరోగ్యం, ప్రతి పౌరుడికి సంపదని సృష్టించే నైపుణ్యం, వ్యవసాయం, ఇతర సంప్రదాయ వృత్తులలో ఆదాయాన్ని పెంచే ఏర్పాట్లు – ఈ నాలుగే బీదరికాన్ని అంతం చేసి అందరికీ న్యాయం అందించే మార్గాలు. కాని ఇవి జరిగితే ఈ దోపిడీ రాజకీయాన్ని, అవినీతి పాలనని స్వాహారాజ్యాన్ని కొనసాగించడం అసాధ్యం. అందుకే నేటి పాలనలో అడపాదడపా తాత్కాలిక రాయితీల ప్రకటన జరుగుతుంది. ప్రతి రూపాయిలో ముప్పావలాని దోచుకోవటం, వనరులని వృథా చేయటం, మిగిలిన కొద్ది మొత్తంతో ప్రజలకి ప్రత్యేకంగా రాయితీలిస్తున్నట్టు నటించి ఓట్లు రాల్చుకోవడం స్వాహారాజ్యంలో తరచు కనిపించే ప్రక్రియలు. ఉచితంగా కలర్ టివీలు, రుణాల మాఫీలు, తాళిబొట్లు, హాజ్‌యాత్రలు, మానస సరోవర్ సబ్సిడీలు, ఇంకెన్నో రాయితీలు – ఇలా ప్రజాధనంతో పౌరులని యాచకులుగా మార్చటం రాజకీయ చతురతగా మారిపోయింది. పౌరుల శక్తి సామర్థ్యాలు వికసించటం కోసం తప్ప, ప్రజలు తమ కాళ్ళ మీద తాము నిలబడడం కోసం తప్ప మరే పనికైనా పన్నుల డబ్బుని ఖర్చు చేసి బీదరికాన్ని కొనసాగించటానికి నేటి పార్టీలు, ప్రభుత్వాలు విపరీతంగా పోటీ పడుతున్నాయి. ప్రజలెంత అమాయకులుగా, అసహాయులుగా ఉంటే పాలకులకి అంత ఆనందం. అప్పుడే స్వాహారాజ్యం యథేచ్ఛగా కొనసాగుతుంది.

మన స్వతంత్రయోధులు దశాబ్దాల పర్యంతం పోరాడి సాధించిన స్వరాజ్యం ఇలా స్వాహారాజ్యంగా మారిన నేపథ్యంలో లోక్‌సత్తా ఉద్యమం తొలి నుంచి ఈ స్వాహారాజ్యం అంతం కావాలని పోరాడుతోంది. రాజ్యాంగ ఫలాలు పొందటం మనందరి జన్మహక్కు. పరాయి వాళ్ళ పాలన పోయి కేవలం వాక్స్వాతంత్ర్యం, ఓటుహక్కు, ఆటగాళ్ళ మార్పు ఉంటే చాలదు. ఆట నియమాలు మారి అందరికీ రాజ్యంగ ఫలాలందించటం కోసం లోక్‌సత్తా 'సురాజ్య' ఉద్యమాన్ని ప్రతిపాదిస్తోంది.

"సురాజ్యం అంటే ఏమిటి? స్వాహారాజ్యాన్ని సురాజ్యంగా మార్చాలంటే ఏం జరగాలి? సురాజ్యానికి నిర్దిష్టమయిన లక్ష్యాలని ప్రతిపాదించినప్పుడే మరోసారి ప్రజలు మోసపోకుండా కాపాడుకోగలం; ఆశించిన ఫలితాలని పొందగలం. లోక్‌సత్తా ఐదు ప్రాథమిక లక్ష్యాలని ప్రతిపాదిస్తూ సురాజ్య ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నది.

**1. కొత్త రాజకీయ సంస్కృతి : ఈనాటి వ్యాపార, పెత్తందారీ రాజకీయ సంస్కృతిని అంతం చేసి ప్రజాస్వామ్య రాజకీయాన్ని ప్రతిష్ఠించాలి.**

- కొందరి స్వంత ఆస్తులుగా, ఆధునిక జమీందారీలుగా, కుటుంబ వారసత్వంగా మారిన పార్టీలని ప్రజాస్వామీకరించి సభ్యులు సంస్థలుగా, సమాజం సంపదగా నిలబెట్టాలి. వనరుల సమీకరణ, వినియోగం పారదర్శకంగా ధర్మబద్ధంగా, చట్టం పరిధిలో ఉండాలి.
- గూండాలని, నేరస్తులని, అక్రమార్జనపరులని, నాయకుల సంతానాన్ని ప్రజల నెత్తిన రుద్దే దారుణ సంస్కృతికి స్వస్తి చెప్పి సమాజంలో అత్యుత్తములని, నిజాయితీపరులని, సమర్థులు, అన్ని వర్గాల ప్రయోజనాలని కాపాడే వారిని ప్రజాజీవనంలోకి తేవాలి.
- ఎన్నికలలో ఓట్ల కొనుగోలు, సారా పంపిణీ, బలప్రయోగం, దొంగఓట్లు అంతం కావాలి.
- సమాజాన్ని చీల్చే దుష్టసంస్కృతిస్థానే ఒకే జాతి, ఒకే పౌరసత్వం రాజకీయానికి ఆలంబన కావాలి.

**2 అవినీతి అంతం :** విశృంఖలంగా అడుగడుగునా రాజ్యమేలుతున్న అవినీతిని అంతం చేసి, స్వాహారాజ్యం స్థానంలో సురాజ్యాన్ని స్థాపించాలి.

- అవినీతిపరుల ఆస్తులని ప్రజలపరం చేసేందుకు చట్టాన్ని తెచ్చి, అక్రమార్జనతో పాటు ఇతర ఆస్తుల కుటుంబానికి అందకుండా చెయ్యాలి.
- అవినీతిపరుల ఆట కట్టించటానికి స్వతంత్ర ప్రతిపత్తితో, సర్వాధికారాలు, సిబ్బందితో, పక్షపాతాలకతీతంగా ఉండే సంస్థని జాతీయ, రాష్ట్ర, జిల్లా, నగరస్థాయిలలో ఏర్పాటు చేయాలి.
- ప్రతి జిల్లాకి ప్రత్యేక కోర్టులని ఏర్పాటు చేసి అవినీతిపరులకి సత్వరం జైలు శిక్ష పడేలా చూడాలి.
- ప్రజలని అవినీతిపై పోరాటంలో భాగస్వాములని చెయ్యటం కోసం, కొనుగోళ్ళలో, కాంట్రాక్టులలో, పథకాల అమలులో ప్రజల నిఘా, అజమాయిషీ ఉండడం కోసం తగిన చట్టాలని చేసి, వాటి సత్వర అమలుకి సంస్థాగత ఏర్పాట్లు చెయ్యాలి.

**3. అందరికీ ఎదిగే అవకాశాలు :** ఆధునికయుగంలో పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకి విద్య, ఆరోగ్యాన్ని అందించటమే రాజకీయానికి, రాజ్యవ్యవస్థకి నైతిక

పునాది. అందరికి ఎదిగే అవకాశాలివ్వని వ్యవస్థ ప్రజలని కేవలం ఓటు బ్యాంకులుగా, చేయిచాచి అర్థించే యాచకులుగా మారుస్తుంది. సురాజ్యంలో అందరి శక్తిని వికసింపజేయటం, నివారించదగ్గ బాధలని నిర్మూలించటం, ఆర్థికవ్యవస్థలో పాలుపంచుకునే నైపుణ్యాన్నివ్వటం మౌలిక లక్ష్యాలు కావాలి.

- ప్రతి బిడ్డకి పన్నెండేళ్ళ పాటు మంచి ప్రమాణాల విద్య అందించటం కోసం సర్వశక్తుల్ని కేంద్రీకరించి ప్రతి పౌరుడి శక్తి సామర్థ్యాలని వెలికితీయాలి.
- ప్రతి కుటుంబానికి పూర్తి ఆరోగ్య భద్రతని కల్పించి ఏ వ్యాధికైనా స్వంత ఖర్చు లేకుండా నచ్చిన ఆసుపత్రిలో చికిత్స అందే ఏర్పాటు చెయ్యాలి.
- ప్రతి పౌరుడికి నైపుణ్యాన్ని పెంచి సంపద సృష్టిలో పాలుపంచుకునే అవకాశాన్ని కల్పించాలి.

**4. అందరికీ ఒకే న్యాయం :** మనది పేరుకు స్వరాజ్యమయినా వాస్తవానికి చట్టం ఉన్నవాడికి చుట్టమయింది. ఉన్నవాడికో న్యాయం, లేని వాడికో న్యాయం సర్వత్రా అమలవుతోంది. బడితె ఉన్నవాడిదే బర్రెకావటంతో నేరస్తులకి గిరాకీ పెరిగింది. అందరికీ సమాన న్యాయం అందించటం, ప్రతిపౌరుడూ తలెత్తుకుని హుందాగా తిరిగే పరిస్థితిని కల్పించటం సురాజ్యానికి ప్రాతిపదిక కావాలి.

- పోలీసు యంత్రాంగానికి స్వయం ప్రతిపత్తినిచ్చి, నేర పరిశోధనని నిష్పాక్షికంగా, సమర్థంగా జవాబుదారీతనంతో చేపట్టే విధంగా ఏర్పాట్లు చేసి సామాన్యులకి రక్షణ కల్పించాలి; చట్టాన్ని ఉల్లంఘించే వాళ్ళు ఎంత బలవంతులయినా వారిని శిక్షంచగలగాలి. పౌరుడు నిర్భయంగా పోలీసు అండని కోరే స్థితిని, కోటీశ్వరుడయినా, అధికారంలో ఉన్నవాడయినా చట్టాన్ని ఉల్లంఘించటానికి భయపడే వాతావరణాన్ని సృష్టించాలి.
- న్యాయవ్యవస్థని ప్రజలకి అందుబాటులోకి తెచ్చి, సకాలంలో సమర్థన్యాయం అందరికీ సులభంగా అందే మార్పులు తేవాలి.

**5. ఇంటి ముంగిట ప్రభుత్వం, కంటి ముందు పాలన :** పేరుకి స్వపరిపాలన అయినా పాలన ప్రజలకి దూరంగా ఉంటే ఫలితాలు రావు. అధికారాన్ని పూర్తిగా వికేంద్రీకరించటం, పౌరుణ్ణి పాలనకి కేంద్రబిందువుని చేయటం, ప్రజలకి వీలయినంత చేరువగా బాధ్యతలని నిర్వహించే ఏర్పాట్లు చెయ్యటం, పౌరుడు నిరంతరం నిలదీసే అవకాశాన్ని కల్పించటం, జవాబుదారీతనం కోసం ఏర్పాట్లు చెయ్యటం, సురాజ్య

నిర్మాణంలో కీలకమయినవి. స్థానిక ప్రభుత్వాల సాధికారత, పౌరుల సార్వభౌమత్వం సురాజ్యానికి పునాదులు.

- జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు
- నగరాలు, పట్టణాలు, గ్రామాల స్వయంపాలన
- వనరులు, బాధ్యతలు స్థానికంగా ప్రజల చేతుల్లో వుంచటం
- కీలకమైన సేవలని పౌరబృందాలే నిర్వహించుకోవటం
- పోలీసు, న్యాయవ్యవస్థలలో వికేంద్రీకరణ
- పాలనా సమాచార హక్కు పూర్తి అమలు
- సకాలంలో సేవల కోసం విధిగా అమలయ్యే పౌరసేవాపత్రాలు
- స్థానికంగా అవినీతిని అంతం చేసేందుకు సంస్థాగత ఏర్పాట్లు

మన రాజ్యాంగ నిర్మాతలు, స్వతంత్రయోధులు ఆశించిన లక్ష్యాలు సాధించటమే సురాజ్యపోరాట లక్ష్యం. ప్రతి పౌరుడు సార్వభౌముడయ్యే నిజమయిన ప్రజారాజ్యాన్ని సాధించటమే మన కర్తవ్యం. ఈ సురాజ్య ఉద్యమం జాతి మొత్తానికి వర్తించేది. ఇది రెండవ స్వతంత్రపోరాటం. ◆

**ఎన్నికల సిత్రం**

**" ఈ ఫోటో ఎందుకంటే ఎన్నికల సభల్లో తానెంత నీతిమంతుడో చెప్పకోవటానికి"**



# సుపరిపాలనకు నిరంతర సంస్కరణలు

మరో స్వాతంత్ర్య దినోత్సవాన్ని మొక్కుబడిగా జరుపుకుంటున్నారు. మరోసారి పతాకవందనాల్ని చూశాం. నేతల పసలేని ప్రసంగాల్ని విన్నాం. సహజంగానే స్వాతంత్ర్యదినం సందర్భంగా దేశ పరిస్థితుల్ని బేరీజు వేస్తుంటారు. కొన్ని ఆలోచనలు మన మనసులలో రేకెత్తుతాయి. ఎన్నో భయాందోళనలు, ఆశలు మన హృదయాలలో చోటుచేసుకుంటాయి.  చర్చలు జరుగుతాయి. ఈ చర్చలలో గతం, వర్తమానం, భవిష్యత్తు గూర్చి కొన్ని పరస్పర విరుద్ధ భావాలు వ్యక్తమవుతుంటాయి. గతాన్ని విశ్లేషించేటప్పుడు రెండు రకాల విరుద్ధ భావనలు మనల్ని చుట్టుముడతాయి. ఓ వాదన ప్రకారం గతమంతా మంచిదే. ఆనాడు విలువలున్నాయి. నిజాయతీ బతికి ఉంది; చెడు మచ్చుకి కూడా కనిపించేదికాదు. మరో వాదన ప్రకారం గతంలో చేసిన తప్పిదాలే నేటి మన దుస్థితికి కారణం; అసలు దేశ సమస్యలన్నింటికీ నెహ్రూ వైఫల్యాలే మూలం. నిజానికి ఈ రెండు వాదనలూ లోపభూయిష్టమయినవే. వాస్తవాలను గమనిస్తే గతంలో కూడా తప్పొప్పులు రెండూ ఉన్నాయనీ, ప్రతి కాలమూ వెలుగునీడల మిశ్రమమనీ తేలుతుంది.

### గతంలో భిన్నవాదనలు

స్వాతంత్ర్యం వచ్చాక ఓ ఇరవైఏళ్ళపాటు దేశంలో పరిపాలన కాస్తంత నిజాయితీగా సాగిన మాట వాస్తవం. అందుకు కారణం ఆనాటి వారేదో దేవతా స్వరూపులు కావటం కాదు. స్వాతంత్ర్య వచ్చిన నాటి స్ఫూర్తి, స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న ప్రతిష్టను సొంతం చేసుకున్న నాయకత్వం,  అధికారక్రీడలో ఎలాంటి దురాగతాలకు పాల్పడవచ్చో ఇంకా పూర్తిగా అర్థం కాని అమాయకత్వం ఆనాటి పాలకులను అదుపులో ఉంచాయి. కాలక్రమేణా స్వాతంత్ర్యం వేడి చల్లారగానే, మొదటి తరం నాయకత్వం కనుమరుగవుతుండగానే మన వ్యవస్థలో ఉన్న లొసుగులు బయటపడ్డాయి. అపశ్రుతులు దొర్లటం ప్రారంభమయింది. అలాగే దేశ సమస్యలన్నింటికీ భారాన్ని ఆనాటి ప్రధాని నెహ్రూ మీద నెట్టడం సరికాదు. సరయిన రాజకీయ సంస్కృతికోసం కేవలం వ్యక్తుల సంస్కారం మీద మాత్రమే ఆధారపడరాదని,

సంస్థాగత ఏర్పాట్లు ఉండాలని నెహ్రూ గుర్తించలేదు. రాజకీయ పార్టీల ప్రజాస్వామికీకరణ కేవలం నాయకత్వం చిత్తశుద్ధి వల్లకాక, చట్టబద్ధ నిర్మాణంలో ఉండాలని ఆనాడు భావించకపోవడం తప్పిదమే. స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధత కల్పించకుండా.. కేంద్రీకృత పాలనకు బీజాలు వేయటం వల్ల దేశం చాలా విలువయిన కాలాన్ని కోల్పోయిన మాట వాస్తవమే. పాఠశాల విద్యకు, అందరికీ అక్షర జ్ఞానానికి పెద్ద పీట వెయ్యకపోవటం పొరపాటే. కాని అదే కాలంలో సాంకేతిక విద్యకు, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు, పార్లమెంటరీ వ్యవస్థకు, పారిశ్రామికీకరణకు, మౌలిక సదుపాయాలకు బలమైన పునాదిపడింది. ఆనాటి పరిస్థితులకనుగుణంగా తొలితరం నాయకత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంది. దేశ విభజన నేపథ్యంలో జాతి ఏకతను కాపాడి ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని పాదుకొల్పింది. ఒకవేళ వాదన కోసం నెహ్రూ తప్పిదాలవల్లే దేశం నేడు గడ్డు పరిస్థితిలో ఉందని అంగీకరించినా, ఆయన గతించి 37 ఏళ్లు గడిచాయి. ఆ తరువాత పుట్టిన వాళ్ళు 75 కోట్లకు పైబడి దేశంలో ఉన్నారు. కాబట్టి నిరంతరం గతాన్ని దూషించటంలో అర్థం లేదు. ఈ 30 ఏళ్ళ కాలంలో ఎన్నో దేశాలు అనూహ్య ప్రగతిని సాధించాయి. గత ఇరవై ఏళ్ళలోనే చైనాలాంటి పెద్ద దేశాలు శరవేగంతో దూసుకుపోయాయి. వర్తమానానికి వస్తే అంతా బాగానే ఉందని సంబరపడేవారు. కొందరు, ఎటు చూసినా చీకటేనని వాపోయేవారు మరికొందరు. కొన్ని ఉన్నత విద్యా సంస్థల ప్రమాణాలు, ఐ.టి. లాంటి కొన్ని రంగాలలో భారతీయుల విజయాలు, పెరుగుతున్న జీవన ప్రమాణాలు, కళ్ళెదురుగా కనిపిస్తున్న సంపద, విస్తరిస్తున్న టెక్నాలజీ, ముందుకి దూసుకెళుతున్న మార్కెటు ఆర్థిక వ్యవస్థ, అడపాదడపా ఆకాశానికంటుతున్న షేరు మార్కెట్లు ఇవన్నీ కొందరికి మోదాన్నిస్తున్నాయి. ఎటు చూసినా తాండవిస్తున్న బీదరికం, ఇంకా.... సగం మందికి అందని కనీస అక్షరజ్ఞానం, లక్షల మంది బాల కార్మికుల దీనస్థితి, ఎటు చూసినా పీడించే అవినీతి, చాలని మౌలిక సదుపాయాలు, యువత వెన్ను విరుస్తున్న నిరుద్యోగం, నేటికీ ప్రబలుతున్న నివారించదగ్గ వ్యాధులు, నేరమయ రాజకీయం, ఎన్నికలలో అక్రమాలు, పాలనా యంత్రాంగం అలసత్వం – ఇవన్నీ ఎందరికో ఖేదాన్ని కలగజేస్తున్నాయి. మరి ఇందులో ఏది వాస్తవం? నూటికి అయిదుగురు మాత్రమే వర్తమానాన్ని గూర్చి నిర్ణయానికి వచ్చేప్పుడు పరిస్థితుల్ని బేరీజు వేసి, వాస్తవాలను

విశ్లేషించి, శాస్త్రీయదృక్పథంతో సమతూకాన్ని పాటించి సరైన తీర్పు ఇస్తారు. కాని మిగిలిన 95 మందికి అలాంటి శక్తి ఉండదు. సమాజంలో ఎప్పుడైె కొందరు గెలిచే వాళ్ళు, మరికొందరు ఓటమి పాలయ్యేవాళ్ళు ఉంటారు. గెలిచేవాళ్ళ దృష్టిలో అన్నీ అందంగానే కనిపిస్తాయి. లంచం మింగి కోట్లు గడించిన అధికారికి, కుట్రలకు పాల్పడి గద్దెనెక్కి పెత్తనం చేస్తున్న రాజకీయ నాయకులకు, ప్రజలను వంచించి స్టాక్‌మార్కెట్‌లో మాయచేసి కోట్లు గడించిన వ్యాపారికి సహజంగానే ప్రపంచం చాలా ఆకర్షణీయంగాను, జీవితం చాలా మధురంగానూ అనిపిస్తుంది. అలాగే నిజాయతీతో, చిత్తశుద్ధితో, కఠిన శ్రమతో సత్ఫలితాలు సాధించిన వారిలో ఆత్మవిశ్వాసం, భవిష్యత్తుపట్ల  నమ్మకం, జీవితం పట్ల మమకారం  తొణికిసలాడుతూ ఉంటాయి. ఇక దగాపడ్డ తమ్ముళ్ళకు బాధాసర్పదష్టులకు, దారిద్ర్యం నుంచి బయటపడే అవకాశం లేని దీనులకు బతుకు భారంగా, జీవితం ఓ రోతగా, ప్రపంచ ఓ చెరసాలగా అనిపిస్తుంది. అధిక సంఖ్యాకులు తమతమ జీవన పరిస్థితులనిబట్టి, మనోస్థితినిబట్టి చుట్టూ ఉన్న సమాజ పరిస్థితిని అంచనా వేస్తారు. వాస్తవం ఏమంటే మన దేశంలో ఇటు అవకాశాలున్నాయి. అటు సంక్షోభమూ విస్తరిస్తోంది.  ఈ  సంక్షోభం మానవ విజ్ఞతకు, మేధకు అతీతమయిందేమీకాదు. మన సమస్యలేమీ పరిష్కారాలకు అందనివి కాదు. మనం కొత్తగా పరిశోధనలేమీ చేయనక్కరలేదు. మన చుట్టూరా ఎన్నో పరిష్కారాలు మనకు గోచరిస్తాయి. ఓ హజారే, ఓ రాజేంద్రసింగ్ – ఇలా ఎందరో మనకున్న పరిమిత వనరులతో ఫలితాలు ఎలా సాధించవచ్చో రుజువు చేస్తున్నారు. అయితే వారి ప్రయత్నాలు ఏవో కొద్ది గ్రామాలకో, కొంతమంది వ్యక్తులకో పరిమితమయినాయి. ఆ పాఠాలను జాతి మొత్తానికి అందజేయాలంటే వ్యవస్థాగత మార్పులవసరం. చిన్న విజయాలను కొందరు వ్యక్తుల చిత్తశుద్ధితో, నాయకత్వ పటిమతో సాధించవచ్చు. కాని ప్రతి గ్రామంలోను అలాంటి వ్యక్తులు మనం తలకిందులుగా తపస్సు చేసినా దొరకరు. ప్రతిచోటా ధీరోదాత్తులకోసం వెదకటం వల్ల ప్రయోజనం లేదు. సామాన్యులతో అసామాన్య ఫలితాలు సాధించటమే ప్రజాస్వామ్యంలోని రహస్యం. అందుకు సంస్థాగత సంస్కరణలు కావాలి. 1868 నాటికి బ్రిటిష్ సమాజంలో అవినీతి విలయతాండవం చేస్తుండేది. ప్రజాధనాన్ని దోచుకోవటం, అధికార క్రీడకోసం జనహితాన్ని బలిపెట్టడం ఆనాడు అనవాయితీగా

ఉండేవి. అప్పుడు గ్లాడ్‌స్టన్ అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వం పని మంచిని ప్రోత్సహించటం, చెడును నిరోధించటం అనే మౌలిక సత్యాన్ని అర్థం చేసుకున్న గ్లాడ్‌స్టన్ 24 ఏళ్ళ కాలంలో మొత్తం బ్రిటిష్ వ్యవస్థను సమూలంగా మార్చేసి నిజాయతీకి పట్టం కట్టారు. రాజకీయాన్ని, పాలనను సంస్కరించారు. వంద సంవత్సరాలక్రితం అమెరికాలో రాజకీయం అంతా కుట్రలకు కల్మషాలకు నెలవుగా ఉండేది. అవినీతి అంతటా తాండవించేది. కాలక్రమేణా వచ్చిన సంస్కరణలు ఆ దేశాన్ని ఆధునిక ప్రపంచంలో అతి సంపన్న సమాజంగా నిలబెట్టాయి. మన పరిస్థితులు ఆలోచించేవాళ్ళకు ఆగ్రహాన్ని, ఆవేదనను కలగజేస్తాయి. అయితే అందుకు సరయిన స్పందన పరిష్కారాలకోసం నిర్విరామంగా కృషి సల్పాలి. అంతేగాని నిరాశతో కుంగిపోయినా ద్వేషంతో హింసకు దిగినా, రాజీపడిపోయి దోపిడీలో పాలు పంచుకున్నా మనం సమస్యలో భాగం అయిపోతాం. పరిష్కారంలో పాలు పంచుకోలేం.

## మంచి వ్యవస్థ సాధ్యమే

**ఇక చివరి ప్రశ్న :** మన భవిష్యత్తు ఎలా ఉంటుంది? ఈ ప్రశ్నకు వచ్చే సమాధానంలో కూడా వైరుధ్యాలున్నాయి. దేశం నాశనమవుతుందని కొందరు భయపడితే, ఏదో ఒక విధంగా మనల్ని దేవుడు రక్షిస్తాడని మరి కొందరు ధీమా ప్రకటిస్తున్నారు. నిజానికి భవిష్యత్తు నేటి మన చర్యల మీద, స్పందన మీద ఆధారపడి ఉంది. మనదేశంలో ఎప్పుడూ రెండురకాల ప్రమాదకర ధోరణులు కనిపిస్తాయి. మొదటిది అంతులేని అసహనం. క్షణాలమీద ఆశించిన మార్పు కావాలని, కొద్ది రోజుల్లోనో, వారాలలోనో అంతా బాగుపడాలని మనం ఎదురు చూస్తే ఆశాభంగం తప్పదు. పెనుమార్పు ఎప్పుడూ క్షణాలలో రాదు, కేవలం కలలలోనో, సినిమాలలోనో తప్ప నిజజీవితంలో ఓర్పుతో, నేర్పుతో ప్రయత్నం చేస్తే ఫలితాలు వచ్చితీరతాయి. అసాధ్యమయిన అద్భుతం సుసాధ్యమయిన మంచికి శత్రువు. రెండో ధోరణి అనవసరమైన నిరాశ. అసలు ఈ దేశానికి భవిష్యత్తే లేదని, ముందురోజులలో ముప్పు తప్పదని నిరాశావాదుల వాదన. విచిత్రమేమంటే ఈ వ్యవస్థ వల్ల లాభపడుతున్న వాళ్ళలోనే అధిక సంఖ్యాలకులకు భవిష్యత్తు పట్ల విశ్వాసం లేదు. మన రాజకీయ నాయకులలో, ఉన్నతాధికారులలో, పారిశ్రామికవేత్తలలో, వ్యాపారులలో మనదేశ భవిష్యత్తు పట్ల నమ్మకమే కనిపించదు. వాళ్ళు సంపాదించిన

డబ్బు విదేశాలలో దాచుకోటం, వాళ్ళ పిల్లలకు ఈ దేశం గాలి సోకకుండా పెంచటం, వాళ్ళ భవిష్యత్తును అమెరికా గ్రీన్ కార్డులలో వెదుక్కోవటం – ఇవన్నీ నిత్యం గమనిస్తూనే ఉన్నాం. ఓ పెద్ద దేశంలో పాలకవర్గాలు ఆ జాతి భవిష్యత్తును నిర్దేశిస్తూనే, సమాజంలో మిగిలిన వాళ్ళ వల్ల లాభపడుతూనే, నిరాశను భవిష్యత్తు పట్ల అపనమ్మకాన్ని ప్రదర్శించటం ఓ అసాధారణమయిన విషయం. కోట్ల రూపాయల అక్రమార్జనలోను, అంతులేని నల్లధనంలోను, చుట్టూ నిర్మించుకునే అభేధ్యమయిన కోటగోడల్లోను, సాయుధ దళాల రక్షణ కవచాలలోను నిజమయిన భద్రతలేదని మన పాలక వర్గాలు గుర్తించే వరకు మన జాతి భవిష్యత్తు ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడుతూనే ఉంటుంది. అద్భుతాలు దైవ సంకల్పం వల్ల అకస్మాత్తుగా జరగవు. మనం చిత్తశుద్ధితో నిర్విరామ కృషితో, విజ్ఞతతో ప్రయత్నిస్తే అందని అద్భుతాలేమీ లేవు. విజ్ఞతతో, స్థిరచిత్తంతో, ముందుచూపుతో, సంఘటితంగా, పరిజ్ఞానంతో వడివడిగా అడుగులు వేస్తే కొద్ది సంవత్సరాలలో మనం గర్వించే వ్యవస్థను, మంచిని పెంచే పాలనను, చెడుని నిరోధించే పరిస్థితుల్ని కల్పించుకోగలం. ఆ తరువాత ఓ రెండు దశాబ్దాలపాటు నిర్విరామ కృషిచేస్తే ఈ దేశంలో పుట్టిన ప్రతి పౌరుడికి కనీస సదుపాయాలను, ప్రతి బిడ్డలోని శక్తి సామర్థ్యాలను వెలికితీసే విద్యా, ఆరోగ్యాలను, అందరికీ న్యాయాన్నందించే సమాజాన్ని నిర్మించుకోగలం. ఇప్పుడు కావలసింది అసాధ్యమయిన అద్భుతాలు కావు. మనమిప్పుడు చేపట్టవలసింది సుసాధ్యమయిన, నిర్దిష్టమయిన మంచి సంస్కరణల్ని. ◆



**" సార్ ! మీరు విడుదల అయ్యాక ఏ పార్టీ తరపున పోటీ చేయబోతున్నారు?"**


# మెరుగైన ఎన్నికలవ్యవస్థ కోసం

**భా**రత ప్రజాస్వామ్య వ్యవస్థ అగమ్యగోచరంగా ఉందా? మనం అనేక విజయాలు సాధించిన మాట నిజం. స్వేచ్ఛను పరిరక్షించుకున్నాం. ప్రజల పాత్ర పెంచగలిగారు. అవసరమైనంతో, అనుకున్నంతో కాక పోయిన కొంతమేరకైనా ఆర్థికాభివృద్ధి సాధించగలిగాం. ప్రశాంతంగా అధికార మార్పిడి చేసుకోగలుగుతున్నాం. రాజకీయాల్లో పోటీ తీవ్రంగా ఉంది అయినా సీనియర్ నాయకులు బాధ్యతగల పౌరులు ఏదో దుశ్శకునాన్ని పసిగడుతున్నారు. వారిలో అశాంతి పెరిగిపోతోంది. రాజకీయ సమీకరణల్లో మార్పు పెచ్చరిల్లుతోంది. (గుజరాత్, ఉత్తరప్రదేశ్) అనేక రకాల ఆలోచనలు సాగుతున్నాయి. యథాతథ స్థితిని నిరాకరిస్తున్నాం. (ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ను, బి.జె.పిని కూడా ప్రజలు తిరస్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టిడిపి బలహీనపడుతున్నాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బల పుంజుకుంటోంది.) ఓట్లు కొనుక్కోవడం బాగా పెరిగింది. (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కార్నటకలో శాసనసభ స్థానానికి పోటీ చేయాలంటే 5 నుంచి 7 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. రాజకీయ పార్టీలు నేరస్థులను ఎన్నికల్లో నిలబెట్టాల్సిన పరిస్థితి వస్తోంది. (యు.పి, బిహార్) విచ్చలవిడిగా జనాకర్షణ విధానాలు అనుసరించడం వల్ల ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోంది. అవినీతి రాజ్యమేలుతోంది. ద్రవ్యలోటు మీద నియంత్రణ లేకుండా పోతోంది. విద్య, ఆరోగ్య సదుపాయాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అనేక రాష్ట్రాలలోనూ, కేంద్రంలోనూ ప్రభుత్వాలు ఈ పతనాన్ని ఆపడంలో నిస్సహాయంగా మిగిలిపోతున్నాయి. ఇంతకు ముందు ఎన్నడూ లేని రీతిలో రాజకీయాలను ప్రజలు ఈసడిస్తున్నారు.

మనం ఎక్కడ దారితప్పాం? రాజకీయాలను, రాజకీయ పార్టీలను మాత్రమే నిందించడం వల్ల ఫలితం లేకపోవడమే కాదు అది వ్యతిరేక ఫలితాలకు దారి తీస్తుంది. రాజకీయాలను ద్వేషిస్తూ పోతే మంచి నాయకులను తయారు చేయడం, పరిస్థితిని మెరుగు పరచడం, దానికి కావాల్సిన నైపుణ్యాన్ని సంపాదించడం అంత కష్టం అవుతుంది. ఆర్థికాభివృద్ధి మన రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరిస్తుందని అనేక

ఏళ్లుగా మనం ఆశించాం. కానీ మన రాజకీయ వైఫల్యాలు ఆర్థికాభివృద్ధిని కొరగాకుండా చేస్తున్నాయి. పేదలకు అవకాశాలు అందకుండా పోతున్నాయి. కాలదోషం పట్టిన రాజకీయాలతో ఆధునిక ఆర్థిక వ్యవస్థ ఎక్కువ కాలం మనుగడ సాగించలేదు.

మనం స్వాతంత్ర్యం సంపాదించుకున్న నాటి పరిస్థితులు ఏమిటో ఆలోచించాలి. స్వాతంత్ర్యపోరాట సమయంలో అన్ని ప్రాంతాలలోనూ, సామాజిక వర్గాలలోనూ అద్భుతమైన నాయకత్వం భారత్‌కు వరంలా ఉండేది. స్వాతంత్ర్యం తర్వాత ఈ స్వాతంత్ర్య సమర యోధులే తొలితరం రాజకీయ నాయకులుగా, జాతినిర్మాతలుగా ఉన్నారు. వారు సంస్థానాలను విలీనం చేయడంలో, శాంతిని నెలకొల్పడంలో, వివిధ వ్యవస్థలను నెలకొల్పడంలో, జాతీయ దృక్పథాన్ని ఆవిష్కరించడంలో ఎన్నదగిన పాత్ర పోషించారు. అందుకే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత విముక్తమైన దేశాలన్నింటిలోనూ భారత్ ఒయాసిస్సులా కనిపిస్తోంది.



**ఇక్కడ లంచం లేకుండా ఫైళ్లు కదలవు**

**ఇది ఆయనకు తెలిసినట్లు లేదు**

అయినప్పటికీ అధికారం కేంద్రీకృతంగా మాత్రమే ఉండిపోయింది. స్వేచ్ఛ, అందరికీ ఓటు హక్కులాంటి ఉత్తమ లక్షణాలతో పాటు అధికారం విపరీతంగా కేంద్రీకృతం అయిపోవడం భారత్ విశిష్టతగా మారింది. (పౌరులు నామమాత్రంగా మిగిలిపోయారు. పౌరసత్వ విలువలు అణగారి పోయాయి.) రేషన్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, భూములకు సంబంధించిన రికార్డుల వంటి సాధారణమైన విషయాలలో కూడా అధికారంలో ఉన్న వారిమీద విపరీతంగా ఆధారపడవలసి వచ్చింది. అధికార వికేంద్రీకరణ కోసం మొదట్లో చేసిన తీవ్ర ప్రయత్నాలను ఒక దశాబ్దం తర్వాత వదిలేశారు. ఈ కేంద్రీకరణ వల్ల స్థానిక నాయకత్వం, వినూత్న ఆలోచనలు ఎదగకుండా పోయాయి. అధికారం వల్ల ఏది సాధ్యమో, దాని పరిమితులు ఏమిటో తెలుసుకోవడానికి  ప్రజలకు సామర్థ్యం కల్పించలేదు. అధికారం, పేదరికం మధ్య అసమతుల్యత వల్ల విధిలేక రోజువారీ అవసరాలు, అందకుండా పోతున్న ప్రభుత్వ సేవల కోసం వెంపర్లాట పెరిగిపోతున్నది. లైసెన్స్ రాజ్యం పరిస్థితిని మరింత దిగజార్చింది. కిందిస్థాయి అధికార వర్గాలకు జవాబుదారీ తనం లేకుండా పోయింది. దోపిడీకి పాల్పడింది. చిన్న చిన్న పనులకోసం కూడా ప్రజలు సిఫార్సుల మీద, లంచాలు ముట్టచెప్పడం మీద ఆధారపడవలసి వచ్చింది. స్వేచ్ఛ మీద ఉన్న మమకారం పోయి 20 ఏళ్లలోనే నిరాశ ఆవహించింది.

అతిసాధారణమైన పనులు జరగాలన్నా నిస్సహాయులైన పౌరుల చేతులో మిగిలిందల్లా ఓటు మాత్రమే. ప్రజల గోడు వినగలిగేది లేదా వినక తప్పనిది తానొక్కడినేనని రాజకీయ నాయకుడు భావించాడు. ఆ రకంగా స్థానిక శాసన సభ్యుడు మరో రూపంలో కార్యనిర్వాహకుడు, ప్రజలు ఎన్నుకున్న మహా రాజు అయిపోయాడు. ఏం జరగాలన్నా అతని మీదే ఆధారపడవలసి వచ్చింది. కానీ నిజానికి చట్టబద్ధమైన అధికారం గానీ, ప్రజలకు అవసరమైన పనులు చేసిపెట్టగల వెసులుబాటు కానీ అతనికి ఉండడం లేదు. ప్రజల అవసరాలు తీర్చడానికి ఆ రాజకీయ నాయకుడు అనునిత్యం ఎంత ప్రయత్నించినా ఫలితాలు నిరాశనే మిగిల్చాయి.

ప్రజలు అన్ని విషయాలకోసం తన మీదే ఆధార పడుతున్నారని రాజకీయ నాయకుడు గ్రహించాడు. అతనికి తన కుటుంబంతో గడిపే తీరికే లేకుండా పోయింది.

నిజాయితీగా జీవనం గడపడానికి ఏ ఆర్థిక కార్యకలాపమూ చేపట్టడానికి వీలు లేకుండా పోయింది. అయినా అది కృతజ్ఞత లేని పనిగా మిగిలిపోయింది. స్వాతంత్ర్య పోరాటం నాటి ప్రాభవమూ మిగలలేదు. పనులు చేయించగలమన్న సంతృప్తి దక్కలేదు. మిగిలిందల్లా ఓట్ల కోసం దేబెరిస్తారన్న తిరస్కారం, విమర్శలు, అసంతృప్తికి గురైన ఓటర్ల సణుగుడు, రాజకీయాల్లో మనుగడ సాధించాలంటే నిజాయితీగా ఉంటే ప్రయోజనం లేదని రాజకీయ నాయకుడు త్వరలోనే నిర్ధారించుకున్నాడు. నిజాయితీ గల రాజకీయ నాయకులు చాలా మంది తెరమరుగయ్యారు. అధికారంలో తిష్ఠ వేసుకు కూర్చున్న రాజకీయాలను లాభసాటి వ్యాపారంగా మార్చుకున్న వారి కొడుకులు, కూతుళ్ళు రాజకీయాల్లో ప్రధాన పాత్రధారులు అయ్యారు.

రాజకీయాల్లో నిజాయితీ పొసగదు అని గ్రహించిన కొంత మంది రాజకీయ వాదులు ఓటర్లను డబ్బు, మద్యంతో ప్రలోభపెట్టడం మొదలు పెట్టారు. ఆ తర్వాత తీవ్రంగా పోటీపడే వారూ అదే దారి అనుసరించారు. భారీ ఎత్తున డబ్బు ఖర్చు చేసినా విజయం సమకూరటం లేదు. అయితే డబ్బు ఖర్చు పెట్టకపోతే అపజయం ఖాయంగా మారింది. రాజకీయాల్లో ప్రవేశించడానికి ధనబలం ప్రధానం అయిపోయింది. అవినీతి వ్యవస్థకు ఆధారం అయింది. అవసరంగా మొదలైన అవినీతి అవకాశంగా మారి సహజ వనరులు, కాంట్రాక్టులు, బదిలీలు, లైసెన్సులు, పర్మిట్లు అన్నీ స్వలాభానికి మార్గాలయ్యాయి. అన్ని రాజకీయ పార్టీలూ ఎన్నికల్లో పెద్ద ఎత్తున డబ్బు గుమ్మరించడంతో ఓట్లు సంపాదించడానికి మరింత డబ్బు అవసరం అయింది. తీవ్రమైన ప్రజాకర్షక విధానాలు, తాయిలాలు ఎన్నికల అంబుల పొదిలో ప్రధానం అయిపోయాయి. విద్య, ఆరోగ్య పరిరక్షణ, నైపుణ్యాలు, ఉద్యోగాల గురించి పట్టించుకోవడం మానేసి పేదలకు స్వల్ప కాలికంగా ఉపయోగపడే ఉచిత బియ్యం, ఉచిత విద్యుత్తు, కలర్‌టీవీలు, సైకిళ్లు మొదలైన ఉపశమనం కలిగించే సదుపాయాలు కల్పించడం మొదలు పెట్టారు. అన్ని పార్టీలు తాయిలాలే విజయం చేకూర్చగలుగుతాయన్న నిర్ధారణకు వచ్చాయి. రాజకీయ ఎత్తులు జిత్తులకు భారతీయ సమాజంలోని కులం, మతం, ప్రాంతీయ విభేదాలు బాగా ఉపకరించాయి. చీలికలు పీలికలు అయిపోయి, భిన్నత్వంతో కూడిన సమాజంలో ఒక వర్గాన్ని మరో వర్గంపైకి ఉసి గొల్పడానికి ఆదినుంచీ ఉన్న ఈ తారతమ్యాలు బాగా ఉపకరించాయి. పోషణ,

ఉన్నత విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవులకు తీవ్రమైన పోటీ ఉంటుంది. కనుక వాటిని వైరుధ్యాలు, అసూయాద్వేషాలుగా రెచ్చగొట్టి దీర్ఘకాలికంగా ఓటు బ్యాంకులు ఏర్పరచుకోవడం సాధ్యం అయింది. ఓట్లు కొనుక్కోవడం, తాయిలాలు, మొదటి నుంచి ఉన్న తారతమ్యాలను ఉపయోగించుకోవడం అన్న మూడు అంశాలు ఇప్పుడు ఎన్నికల రాజకీయాలకు ప్రధాన ఆధారంగా మారిపోయాయి.

1947 నుంచి మూడు దశల రాజకీయాలను గమనించవచ్చు. మొదటిదశ 1947–67)లో జాతి నిర్మాణం, కాంగ్రెస్ ఆధిపత్యం ప్రధానంగా కనిపిస్తుంది. రెండవ దశ (1967–89) కాంగ్రెస్ గుత్తాధిపత్యానికి సవాళ్లు, ప్రత్యామ్నాయాలు గమనించవచ్చు. మూడవ దశ (1989–2000)లో అన్ని రాష్ట్రాలలోనూ, కేంద్రంలోనూ అధికారం కోసం తీవ్రమైన పోటీ నెలకొన్నది. ఇప్పుడు మనం నాల్గవ దశలోకి ప్రవేశిస్తున్నాం. ఆగ్రహం, నిరుత్సాహం, రాజకీయాలంటే ఈసడింపు, నిర్వేదం, సువ్యవస్థితమైన రాజకీయ పార్టీలను నిరాకరించడం, విభేదాలు, మొదటి నుంచి కొనసాగుతున్న వ్యత్యాసాలు, విచ్చలవిడి అవినీతి, సవాళ్లను ఎదుర్కొనడంలో అంతకంతకు పెరిగిపోతున్న అసమర్థత, ప్రజలతో నిజాయితీతో సంప్రదించలేకపోవడం, శక్తి ఉడిగిపోవడం, అడ్డూ ఆపూ లేని జనాకర్షణ విధానాలు ఈ నాల్గవదశ ప్రధాన లక్షణాలు.

మరి ఇప్పుడు మన గమ్యం ఏమిటి? భారతరాజకీయాలు దిగజారి అరాచకానికి దారి తీస్తాయా? రాజకీయాలు విఫలం అయినందు వల్ల మన ఆర్థిక వ్యవస్థ కునారిల్లి పోతుందా? భారత్ భారీ ఆర్థిక వ్యవస్థగా మారడానికి బదులు ఏదోలే అన్నట్టుగా మిగిపోతుందా? భావితరం కూడా పేదరికం, బాధలు, కష్టాల్లో మునిగిపోతుందా? ఈ రాజకీయ రొంపినుంచి బయట పడే మార్గం ఉందా? ఈ ప్రశ్నలు ప్రస్తుతం సహజంగానే తలెత్తుతాయి.

దీర్ఘకాలికంగా కొనసాగుతున్న రాజకీయ సంక్షోభ పరిష్కారానికి సాధారణమైన చిట్కాలు ఉండవు. దగ్గరి దారులు కుదరవు. అన్ని సమాజాలకూ ఒకేలా వర్తించే పరిష్కారాలు ఉండవు. ఒకనిర్దిష్ట పరిస్థితికి ఉపకరించే అంశాలు మరో రకమైన పరిస్థితుల్లో వర్తించవు. ఒక నిర్దిష్ట సందర్భంలో మార్పుకు దోహదం చేసే అంశాలు ఏమిటో గుర్తించ గలిగితే సత్వరం పరిస్థితిని సరిదిద్దడం సాధ్యం అవుతుంది.

## ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ

మనం అమలు చేస్తున్న మొదట గీత దాటినవాడే విజేత అన్న ఎన్నికల వ్యవస్థలో ప్రతినియోజక వర్గంలో నామమాత్రపు అదనపు ఓట్లకు విజయంలో ప్రాధాన్యం ఉండడం వల్లే సుడిగుండంలో కూరుకు పోతున్నాం. మనం అనుసరిస్తున్న వ్యవస్థలో ఇతర అభ్యర్థులకన్నా ఎక్కువ ఓట్లు సంపాదించే అభ్యర్థి ప్రతి నియోజక వర్గంలో విజయం సాధిస్తున్నాడు. ఇలాంటి వ్యవస్థలో బలమైన పార్టీకి అనువైన సీట్ల మెజారిటీ దక్కే అవకాశం ఉంటుంది. బ్రిటన్‌లోనూ, మునుపు బ్రిటన్ వలస దేశాలుగా ఉన్న అమెరికా, భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, కెనడా వంటి దేశాలలో మాత్రమే ఈ వ్యవస్థ అమలులో ఉంది. అమెరికా, ఫిలిప్పీన్స్ దేశాలలో అధ్యక్ష తరహా పాలన ఉంది. పాకిస్తాన్‌లో దేశాధ్యక్షుడికి, మంత్రివర్గానికి మధ్య అధికారాల విభజన ఉంది. అక్కడ సైన్యం ఆధిపత్యం వహిస్తూ ఉంటుంది. ఇతర స్థాయిల్లో అంటే స్థానిక ప్రభుత్వాలు, స్కాట్‌లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్, యూరప్ పార్లమెంట్, లండన్ నగరంలో బ్రిటన్‌లో భిన్నమైన వ్యవస్థలు అమలులో ఉన్నాయి. హౌస్ ఆఫ్ కామన్స్‌లో మాత్రమే మొదట గీత దాటిన వాడే విజేత అన్న వ్యవస్థ అమలులో ఉంది.

మొదట గీత దాటిన వాడే విజేత అన్న వ్యవస్థ బ్రిటన్‌లో బాగానే పనిచేస్తోంది. అక్కడి ఓటర్లు విద్యావంతులు, విషయ పరిజ్ఞానం ఉన్న వారు. అక్కడ ప్రజా జీవనంలో చర్చలు వివేకవంతంగా ఉంటాయి. విధానాలు, సమస్యల మీద దృష్టి కేంద్రీకరిస్తారు. ఓట్లు కొనే పద్ధతి లేదు. అత్యంత ప్రతిభావంతులు రాజకీయాల్లోకి ఆకర్షితులవుతారు. పార్టీలు ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదిస్తాయి. కొత్త నాయకత్వం, కొత్త భావాలు నిరంతరం వస్తూనే ఉంటాయి. అలాంటి దేశంలో ఎన్నికల వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉండదు.

ప్రస్తుతం భారత్‌లో ఎవరికి ఒక ఓటు ఎక్కువ వస్తే వారే గెలిచినట్లు అన్న విధానం వల్ల భిన్నమైన పరిణామాలు వస్తున్నాయి. ఈ విధానంలో అభ్యర్థికి వచ్చిన మొత్తం ఓట్లకుగానీ, పార్టీకి వచ్చిన మొత్తం ఓట్లకు గానీ ఎలాంటి ప్రాధాన్యత లేదు. కావాల్సిందల్లా ప్రత్యర్థికన్నా కనీసం ఒక్క ఓటైనా అధికంగా సంపాదించడం, ఒక్క ఓటు ఎక్కువ అంటే విజయమే. ఒక్క ఓటు తక్కువ అంటే అపజయమే. ఈ విధానంలో

రెండో బహుమతి లేదు. అందువల్ల అభ్యర్థి విజయం సాధించాలంటే ఈ అదనపు ఓటు రాబట్టడానికి ఓటర్లను ఆకట్టుకోవాలి. అవినీతి అపారంగా ఉన్న పేద దేశంలో నామమాత్రపు అదనపు ఓటర్లను ఆకట్టుకోవడానికి ఓట్లు కొనక తప్పదు. ఎక్కువ ఓట్లు సాధించే వారే విజేత అన్న విధానంలో ఓటర్లు చాలా అరుదుగానే ఉత్తమ అభ్యర్థిని ఎన్నుకుంటారు. ఓటర్లు తమ అంచనాలో కనిష్ఠ అవకాశం అన్న భయం ఉంటుంది. కనక రెండవ నాసిరకం పార్టీని ఎన్నుకుంటారు. మెరుగైన అభ్యర్థులు, పార్టీలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా ఓటర్లు తమ ఓటు వృథా కాకూడదనుకుంటారు. ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అన్న విధానంలో ఇద్దరు ప్రధానమైన అభ్యర్థులకు  రెండు ప్రధాన పార్టీలకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. అందువల్ల అందరూ నామమాత్రపు అదనపు ఓట్లను రాబట్టడానికి ప్రయత్నం చేస్తారు. ఎవరు గెలిచిన వారు అదే పద్ధతి అనుసరిస్తారు. ఎన్నికల తర్వాత అందుకే మౌలికమైన మార్పు ఏమీ ఉండదు. డబ్బు ప్రలోభానికి లొంగని చాలా మంది ఓటర్లు ఎన్నికలకు దూరంగా ఉంటారు. ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అన్న విధానంలో సాధారణంగా ఓటింగ్ శాతం దామాషా పద్ధతి కన్నా 10–15 శాతం తక్కువ ఉంటుంది. అభ్యర్థులు ఓట్లు కొనడం గనక మానేస్తే చాలా నియోజక వర్గాలలో ఓట్ల శాతం 60 కాకుండా 40 శాతం మాత్రమే ఉంటుంది.

నేడు దేశంలో ఉన్న పరిస్థితులో ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అన్న విధానంలో రాజకీయ పార్టీలు అత్యంత ఉత్తమ అభ్యర్థులను పోటీ చేయించరు. ఏదో రకంగా అదనపు ఓట్లను రాబట్టగలిగే  అభ్యర్థులను మాత్రమే పోటీ చేయిస్తారు. ఓట్లు కొనడం కోసం అపారంగా డబ్బు ఖర్చు పెట్టగలిగే వారు (కొన్ని రాష్ట్రాలలో ఒక్కో ఎం.ఎల్.ఎ రూ॥5 నుంచి 10 కోట్ల దాకా ఖర్చు పెడుతున్నారు.) లేదా ఆ నియోజకవర్గంలో ఆధిపత్యంలో ఉన్న కూలానికి నాయకుడిగా ఎదిగిన వారు, లేదా కండబలం చూపించ గలిగిన నేరస్థులు, డబ్బు, కులబలం చూపించ గలిగిన వారే రాజకీయ పార్టీలకు కూడా అధికారం కోసం పోటీ పడేప్పుడు మెరుగైన అవకాశాలు ఉన్న అభ్యర్థులుగా కనిపిస్తారు. పరిస్థితులను చక్క దిద్దాలన్న తీవ్రమైన సంకల్పం ఉన్న నాయకులు కూడా అధికారం, పలుకుబడి సంపాదించాలంటే అలాంటి అభ్యర్థులనే ఎంపిక చేయక తప్పదు.

రాజకీయాలో విజయం, మార్పుకు అవకాశాలను పునర్నిర్వచించగలమా? మన

నాయకులను ఎన్నుకోవడానికి భిన్నమైన పద్ధతి అనుసరిస్తే పరిస్థితి మారుతుందా? ఏ ఎన్నికల వ్యవస్థా సంపూర్ణంగా లోపరహితమైంది కాదు. నిర్దిష్టమైన సందర్భంలో ఆచరణాత్మకమైన, ఆమోదయోగ్యమైన సమాధానాల కోసం అన్వేషించాలి. రాజకీయ నాయకులను ఈసడిస్తూ ప్రజా జీవనానికి దూరంగా ఉండడంకన్నా ఎన్నికల వ్యవస్థమీద దృష్టి కేంద్రీకరించడం మంచిది. మనం ఓట్లు కొనడం అనవసరం అయ్యే, నిజాయితీతో కూడిన రాజకీయాలు మనగలిగే, రాగద్వేషాలకన్నా విధానాలు, ఆలోచనలకు ప్రాధాన్యం ఉండే, నిజాయితీపరులు, ప్రయోజన కరంగా ఉండే పౌరులు ఎన్నిక కాగలిగే, అవినీతిని అంతమొందించగలిగే చట్టాన్ని రూపొందించ గలగాలి. ఒక పార్టీకి రాష్ట్రాల వారీగా అది సంపాదించగలిగే ఓట్లను బట్టి చట్టసభలో సీట్లు వచ్చే వ్యవస్థను అనుసరించ గలిగితే మన రాజకీయాలలో, ఫలితాలలో సమూలమైన మార్పులు సాధ్యం అవుతాయి.

అలాంటి దామాషా పద్ధతి ఎన్నికల వ్యవస్థలో ఒక నియోజక వర్గంలో సీట్లు సంపాదించడానికి నామమాత్రపు అదనపు ఓట్లను సంపాదించాల్సిన అవసరం ఉండదు. ప్రతి రాజకీయ పార్టీ ఒక్కో రాష్ట్రంలో సంపాదించగలిగే ఓట్లనుబట్టి లోక్‌సభలో, శాసనసభలో ఆ దామాషా ప్రకారం సీట్లు సంపాదించ గలుగుతుంది. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే రీతిలో ఒక నియోజకవర్గంలో ఓట్లు కొనడానికి అంత ప్రాధానం ఉండదు కనక ఓట్లు కొనడం అనవసరం అవుతుంది. రాజకీయ పార్టీలు ప్రజా జీవనాన్ని సుసంపన్నం చేసి ఎన్నికల ద్వారా సమకూరే ప్రయోజనాలను పెంపొందించ గలిగే అర్హులైన, ఉదాత్తులైన అభ్యర్థులనే పోటీకి దింపగలుగుతాయి. ఇప్పుడైతే అలాంటి వారిని రాజ్యసభకు మాత్రమే నామినేట్ చేయగలం, ఎన్నికలో నిలదొక్కుకోవడానికి రాజకీయ పార్టీలు అపవిత్రమైన రాజీలు కుదుర్చుకోవాల్సిన అవసరం ఉండదు. తమదృక్పథం, విధానాల ఆధారంగా పార్టీలు నిజాయితీగా ఓట్లు అభ్యర్థించవచ్చు, అవినీతి పరులు, నిర్వేదంలో కూరుకుపోయిన రాజకీయ నాయకుల స్థానంలో నిజాయితీ పరులు, సమర్థులు అయిన నాయకులు వస్తారు. వారికి సమాజంపై విశాలమైన దృక్పథం ఉంటుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న నాయకుల వంటి నాయకులు యువతరాల నుంచి వచ్చి నవ భారతాన్ని నిర్మించగలుగుతారు. నిర్వేదానికి, నిరాశకు గురైన పౌరులు అనేక మంది పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఎన్నికల్లో పాల్గొనగలుగుతారు. ప్రజాస్వామిక పునరుజ్జీవనం సాధ్యం అవుతుంది.

## స్థానిక ప్రభుత్వాలు

దీనికి తోడు మనం స్థానిక ప్రభుత్వాలకు నిజంగా అధికారాలు, వనరులు బదలాయించి, పటిష్ఠమైన మూడవ అంతరపు ఫెడరల్ వ్యవస్థను రూపొందిచగలిగితే మన ప్రజాస్వామ్యం పరిణతి చెందుతుంది. తమ ఓటుకు ప్రజాశ్రేయస్సుకు మధ్య ఉన్న లంకెను ప్రజలు గుర్తించగలుగుతారు. ఎన్నికైన వ్యక్తి వాస్తవంగా భిన్నమైన రీతిలో వ్యవహరించడం మొదలు పెడతాడు. మరింత దాపరికం లేని పద్ధతి ఉంటుంది. పన్నులు, వనరులు ఎలా వినియోగిస్తున్నారో స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. సేవలు మెరుగు పడేలా ప్రజలు చూడగలుగుతారు. అధికారం జవాబుదారీతనంతో ముడిపడి ఉంటుంది. పనిచేయక పోవడానికి సాకులు చేప్పే అవకాశం ఉండదు. సాధించి చూపించగలిగే వారికి మాత్రమే అధికారం దక్కుతుంది.

**ఎఫ్‌పిటిపి Vs దామాషా పద్ధతి : ఏది మెరుగు?**

ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేతలు అన్న విధానాన్ని ఏ దేశాలు అనుసరిస్తున్నాయి? అమెరికా, యుకె, కెనడా, భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, మనాలీ జాంబియా.

**ఎప్‌పిటిపి విధానంలో ఉన్న లోపం ఏమిటి?**

ప్రజలకు ఎంపిక చేసుకోవడానికి రెండే మార్గాలు (రెండు పార్టీలు, లేదా ఇద్దరు అభ్యర్థులు) ఉంటే ఈ విధానం ప్రజాభీష్టాన్ని ప్రతిబింబించగలుగుతుంది. కానీ ఎంపిక చేసుకోవడానికి అనేక అభ్యర్థులు ఉన్నప్పుడు ఫలితాలు గందరగోళంగా, అవకతవకగా ఉంటాయి. ఎన్నికైన చట్టసభకు పూర్తి ప్రాతినిధ్య స్వభావం ఉండదు.

**ఎఫ్‌పిటిపి అంటే మైనారిటీ ప్రభుత్వాలు ఏర్పడతాయా?**

2004, 2009 ఎన్నికల్లోనూ యుపిఎ 40 శాతం కన్నా తక్కువ ఓట్లు సంపాదించింది. మరో రకంగా చెప్పాలంటే అత్యధిక సంఖ్యాక ఓటర్లు- 60 శాతం కన్నా ఎక్కువ మంది యుపిఎకు అనుకూలంగా లేరు. కాని ఎఫ్‌పిటిపి పద్ధతి వల్ల యుపిఎ మెజారిటీస్థానాలు సంపాదించగలిగింది.

**ఎఫ్‌పిటిపి విధానంలో ఓట్ల వాటాకు సీట్లకు ఉన్న సంబంధం ఏమిటి?**

ఓట్ల వాటాలో చిన్న పాటి మార్పు జరిగితే ఒక పార్టీ సాధించగలిగే ఓట్లు పొంతన లేని పద్ధతిలో అమాంతం పెరగవచ్చు. లేదా తగ్గి పోవచ్చు. ఉదాహరణకు

ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ 2007లో 25.43 శాతం ఓట్లు తెచ్చుకోగా, 2012 శాసనసభ ఎన్నికలలో 29.15 శాతం ఓట్లు సంపాదించింది. అంటే ఆ పార్టీ ఓట్లు 3.72 శాతం పెరిగాయి. కాని ఆ పార్టీ అదనంగా 127 స్థానాలు సంపాదించగలిగింది. అంటే ఆ పార్టీ స్థానాలు 131 శాతం పెరిగాయి. ఈ సారి కాంగ్రెస్ ఓట్ల శాతం కూడా 3.02 శాతం పెరిగింది. కాని ఆ పార్టీకి ఆరు సీట్లు మాత్రమే పెరిగాయి.

**ఏ దేశాలు దామాషా పద్ధతిని అనుసరిస్తున్నాయి?**

అత్యధిక దేశాలు ఈ పద్ధతే అనుసరిస్తున్నాయి. జర్మనీ ఫ్రాన్స్, ఆసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రెజిల్, రష్యాతో పాటు చాలా దేశాలు వివిధ తేడాలతో దామాషా పద్ధతినే అనుసరిస్తున్నాయి. మరి కొన్ని దేశాలు దామాషా పద్ధతిని, ఎఫ్‌పిటిపిని కలిపి అమలు చేస్తున్నాయి.

**దామాషా పద్ధతి ఎందుకని మరింత మెరుగైంది?**

దామాషా పద్ధతి మెరుగైంది, ఎక్కువ ప్రాతినిధ్య స్వభావం కలిగింది కావడంతో పాటు ఈ విధానం ఎన్నికల వ్యయాన్ని తగ్గిస్తుంది. ధనబలాన్ని, కండబలాన్ని ఉపయోగించే అవకాశాన్ని కొంత తగ్గిస్తుంది. ఉప ఎన్నికలను కూడా నివారించవచ్చు.

**మరి భారత రాజకీయ పార్టీలు దామాషా పద్ధతిని ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి?**

దామాషా పద్ధతివల్ల పార్లమెంట్‌లో తమ బలం తగ్గుతుందని, తద్వారా రాజకీయ పలుకుబడి తగ్గుతుందని ప్రాంతీయ పార్టీలు భయపడుతున్నాయి. ఈ వ్యవస్థ సంక్లిష్టమైందనీ, అస్థిరతకు దారి తీస్తుందని జాతీయ పార్టీలు భావిస్తున్నాయి.

**రాజ్యాంగం దామాషా పద్ధతికి అనుమతిస్తుందా?**

ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేతలు అన్న విధానాన్ని అనుసరించాలని మన రాజ్యాంగంలో ఎక్కడా నిర్దేశించ లేదు. చేయవలసిందల్లా ప్రజా ప్రాతినిధ్య చట్టంలో దానికి అనుగుణమైన సరవరణ మాత్రమే, రాజ్యాంగం నిర్దేశించేదల్లా ప్రభుత్వం ఉమ్మడిగా పార్లమెంట్‌కు జవాబు దారీగా ఉండాలనీ, లోక్‌సభ అభ్యర్థులను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోవాలని మాత్రమే. ◆



మొదటిసారి సైకిల్‌మీద, తరువాత కారులో,

ఈసారి హెలికాప్టర్‌లో ప్రచారం చేస్తున్నాడు

ఆయన ఎదిగిపోతున్నాడు, మనం ఇక్కడే ఉంటున్నాం

# ప్రస్తుత ఎన్నికల వ్యవస్థతోనే అనర్ధాలు

రెండో ప్రపంచ యుద్ధం తరువాత విముక్తిపొంది, దాదాపు ఆరు దశాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా పటుతర ప్రజాస్వామ్యంతో పరిఢవిల్లుతున్న అతికొద్ది దేశాల్లో భారత్ ఒకటి. అత్యవసర పరిస్థితి కారణంగా స్వల్ప అవరోధం ఏర్పడినప్పటికీ మన పయనం ఆగలేదు. మన రాజకీయ ప్రక్రియ ఈ సవాలుకు ప్రజాస్వామిక రీతిలో సమాధానమిచ్చింది. పోటాపోటీగా జరిగే ఎన్నికలు, రాజకీయ స్వాతంత్ర్యం, శాంతియుత, నాగరిక పద్ధతిలో అధికార బదిలీ, ఎన్నికైన ప్రభుత్వాలకు సక్రమంగా అధికారం సంక్రమించడం–క్రియాశీల ప్రజాస్వామ్యంలో అవిభాజ్యమైన అంశాలివి. ఈ అన్ని విషయాల్లో భారత్‌ది గౌరవప్రదమైన, గర్వకారణమైన స్థాయే. సుస్థిరత, చెప్పుకోదగ్గ ఆర్థికవృద్ధి సాధించడంలోను, భిన్నత్వంలో ఏకత్వ భావనను ప్రోది చేయడంలోను మన రాజకీయ ప్రక్రియ తోడ్పడింది. అయితే, మన రాజకీయాల్లో కొన్ని చెడులు కూడా ఉన్నాయి. అవినీతి, బంధుప్రీతి, అశ్రితపక్షపాతం, రాజకీయాలు నేరమయం కావడం, నేతల అధికార దుర్వినియోగం, చట్టవిరుద్ధం గా వ్యవహరించడం, సంకుచిత ధోరణి ఇవన్నీ మన రాజకీయాల్లో అంతర్భాగాలైపోయాయి. శక్తి సామర్థ్యాలు ఎంతో ఉన్నా ఒక జాతిగా మనం ఆ మేరకు ఎదగలేకపోయామని మన కందరికీ తెలుసు. ఈ పరిస్థితుల్ని మార్చాల్సిన ప్రాథమిక బాధ్యత వారిమీదే ఉంది.

### దిగజారుతున్న ప్రమాణాలు

“పర్యవసానాలతో నిమిత్తం లేకుండా రాజకీయ దుస్సాహసాలకు పాల్పడే వారివల్ల రాజకీయాలు పతనం కావడమే కాదు, వారి నిర్వాకం జాతి వినాశానికి, విధ్వంసానికి కూడా దారితీస్తుంది” అంటూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గతంలో చేసిన వ్యాఖ్యలు ఎంతో సహేతుకమైనవి. మరో సందర్భంలో జస్టిస్ పి.బి.సావంత్ కూడా ఇదే తీరులో స్పందించారు. మహారాష్ట్రలో మంత్రుల అవినీతిపై విచారణ జరిపిన సావంత్, ప్రభుత్వానికి అందచేసిన తన నివేదికలో రాజకీయ నాయకుల వైఖరిని తూర్పారబట్టారు. “అధికారానికి, అక్రమార్జనకు రాజకీయాలను మేలు మార్గంగా భావిస్తున్న వారి సంఖ్య

ఇబ్బడిముబ్బడిగా పెరిగి పోతోంది. తాము చట్టానికి అతీతుల మనే స్థాయిలో వారు వ్యవహరిస్తున్నారు. ఎన్నికలలో అభ్యర్థులు భారీ మొత్తాలను వ్యయం చేస్తున్న నేపథ్యంలో అవినీతిని కొంతవరకూ చూసీ చూడనట్టుగా వదిలివేయాలనే వాదన గత కొన్నేళ్లుగా ఊపందుకుంది. ఇది ప్రమాదకరమైన ధోరణి" అని ఆయన హెచ్చరించారు. రాజకీయాల్లో దిగజారుతున్న ప్రమాణాలపట్ల డాక్టర్ కలామ్, జస్టిస్ సావంత్‌ల ఆవేదన సహేతుకమైనది.

రాజకీయాల్లో అవినీతి వేళ్లూనుకోవడానికి కారణాలేమిటో పరిశీలించాలి. నాయకులకు ఒనగూడుతున్న ప్రయోజనాలను, అనివార్యతలను అర్థం చేసుకోవాలి. రాజకీయ నాయకులంతా ప్రత్యేకమైన కోవకు చెందిన వారని, వారు అవలంబించే మోసపూరిత విధానాలే సకల అనర్థాలకు కారణమనే నిర్ధారణకు రావడం ప్రమాదకరం. ఇది ఒక విధంగా ప్రతికూల ప్రభావాన్ని కలగజేస్తుంది. రాజకీయాల్లో మిగిలి ఉన్న మంచిని కూడా తుడిచిపెడుతుంది. ప్రజల్ని నిరాశానిస్పృహలకు లోను చేస్తుంది. వారిలో రాజకీయ వ్యతిరేక భావాలు నాటుకునేందుకు, రాజకీయేతర పరిష్కార మార్గాల వైపు వారిని పురిగొల్పేందుకు దారితీస్తుంది. అలా అని ప్రజల్ని తప్పు పట్టడమూ సమంజసం కాదు. రాజకీయాలు వక్రమార్గం పడుతున్నప్పుడు ప్రజలేం చేయగలరు?

## జడలు విప్పుతున్న అవినీతి

అభ్యర్థుల ఎన్నికల వ్యయం అసాధారణమైన రీతిలో పెరిగిపోతోంది. ఐదేళ్ల కాలవ్యవధిలో జరిగిన లోక్‌సభ, శాసనసభ ఎన్నికలలో రూ. 15,000 కోట్లు ఖర్చయినట్లు కొన్ని అంచనాలు చెబుతున్నాయి. అలాంటప్పుడు అనేక రాష్ట్రాలలో అసెంబ్లీకి పోటీపడిన ప్రధాన అభ్యర్థులు తమ గెలుపు కోసం 4, 5 కోట్ల రూపాయలకు పైనే ఖర్చు చేశారంటే ఆశ్చర్యమేముంది? ఇంత భారీ యెత్తున వ్యయం చేస్తున్నప్పుడు అందుకు తగ్గట్టుగానే రాబడి ఉండాలని నాయకులు ఆశిస్తారు. అక్కడే అవినీతి జడలు విప్పుతోంది. తాము ఎన్నికల్లో ఖర్చు చేసిన దానికి పదిరెట్లు అధికంగా నాయకులు తమ ఐదేళ్ల పాలనలో అవినీతి మార్గాల ద్వారా సంపాదిస్తున్నారు. బదిలీలు, నియామకాలు, కాంట్రాక్టులు, టెండర్లు, నేర పరిశోధన, విచారణ వంటివి నాయకుల అక్రమార్జనకు ఉపయోగపడుతున్నాయి.

అభ్యర్థులు ఎన్నికల కోసం వ్యయం చేస్తున్న మొత్తంలో చాలావరకు లెక్కల్లోనికి రానిదే. ఓట్లు కొనుగోలు చేయడం, అధికారులకు లంచాలతో ఎరవేయడం, కిరాయి గూండాలను నియమించకోవడం వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకోసం ఎక్కువగా డబ్బు ఖర్చు చేస్తున్నారు. డబ్బుకు ఆశపడి అభ్యర్థుల కొమ్ముకాసే 'కార్యకర్తలు' కూడా ఎన్నికల వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరగడానికి కారణం. ఎన్నికల ప్రచార వ్యయంపై పరిమితులు విధించినంతమాత్రాన ఈ సమస్యకు పరిష్కారం లభించదు. నిజానికి, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన చట్టాలకు 2003లో తెచ్చిన సవరణలు ఎంతో ప్రయోజనకరమైనవి. చట్టాలలోని లోసుగులకు వీటి ద్వారా (ఆర్.పి.చట్టం సెక్షన్ 77) అడ్డుకట్టపడింది. పార్టీలకు వ్యక్తులు, సంస్థలు ఇచ్చే విరాళాలపై చట్టపరంగా పన్ను మినహాయింపు లభించింది. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు ఛానెళ్లలో ప్రచారం నిమిత్తం ఉచిత సమయాలను పొందే హక్కు చట్టపరంగా లభించింది. అయితే నియమ నిబంధనల రూపకల్పన జరగనందున ఈ సౌకర్యం ఇంకా అమలులోకి రాలేదు. అయినప్పటికీ ఎన్నికల సంస్కరణల పథంలో మనం వేసిన ముందడుగుగా దీనిని చెప్పుకోవచ్చు. అమెరికా వంటి ఎన్నో దేశాలు దశాబ్దాల తరబడి ప్రయత్నిస్తున్నా తమ ఎన్నికల విధానంలో ఈ తరహా మార్పులు తీసుకురాలేకపోతున్నాయి.

ప్రస్తుతం రాజకీయాలనేవి వ్యాపారంగా మారిపోయాయి. ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారిదే విజయమని చెబుతున్న మన ఎన్నికల వ్యవస్థలో అదనపు ఓట్ల కోసం పార్టీలు ధనబలం కలిగిన రాజకీయ నాయకులపైన, కులం, కుటుంబ సంబంధాలు... అన్నింటికీ మించి కండబలం పైనా ఆధారపడే దుస్థితి దాపురించింది. నిజాయతీగల నాయకులు ఎన్నికలలో పోటీ చేసి గెలిచే అవకాశాలు దాదాపు మృగ్యమైపోయాయి. దాంతో ప్రతిభాపాటవాలు, నిజాయతీ, రుజువర్తనగల నాయకులు రాజ్యసభను మాత్రమే ఆశ్రయిస్తున్నారు. ఒక మన్మోహన్‌సింగ్ లేక మరో అరుణ్‌జైట్లీ ఎన్నికలలో నిలబడితే గెలుపు సాధించలేకపోవచ్చునేమోగాని పప్పు యాదవ్, అరుణ్‌గావ్లీ వంటి వారు బరిలోకి దిగితే గెలుపు తథ్యమన్నమాటే. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలనేవి ప్రభుత్వాలను మార్చగలవేమోగాని పాలనావ్యవస్థను ప్రక్షాళన చేయలేవు. ఒకవేళ ఎవరైన ముఖ్యమంత్రి స్వచ్ఛమైన పాలనను అందించేందుకు ప్రయత్నిస్తే శాసనసభ్యుల ఆగ్రహాన్ని చవిచూడకతప్పదు.

## హింసారాజకీయాలతో ప్రజాస్వామ్యానికే ముప్పు

హింసా రాజకీయాలకు పాల్పడుతున్నవారికి ప్రజామోదం, గౌరవ మర్యాదలు ఎందుకు లభిస్తున్నాయి? హత్యలకు, హింసాకాండకు పాల్పడుతున్న వారికి సమాజంలో హీరోలుగా గుర్తింపు లభిస్తున్న మాట నిజం. పలు సందర్భాలలో నాయకుల ఆగడాలకు సామాన్య ప్రజలు మద్దతు పలకడం, వారి అమానుషకాండను వీరోచితకృత్యాలుగా పరిగణించడం జరుగుతుంది. వాస్తవానికి– ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వమూ, దాని ఆధ్వర్యంలో పనిచేసే సంస్థలూ ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకునే వాటిలో కీలకమైనది న్యాయం. ప్రజలకు నిష్పాక్షికమైన, సత్వర న్యాయాన్ని అందించవలసిన బాధ్యతను నియంతలు, నిరంకుశ రాజ్యాధినేతలు సైతం గుర్తించారు. కానీ శాంతియుతమైన, క్రమబద్ధమైన విధానాల ద్వారా న్యాయం లభిస్తుందన్న విశ్వాసాన్ని ప్రజలలో కలిగించడంలో ప్రభుత్వ సంస్థలు విఫలమయ్యాయి. ఆస్తితగాదాలు లేదా చిన్నపాటి వివాదాలు, భౌతిక దాడుల వంటి కేసులలోనూ సరైన, సంతృప్తికరమైన న్యాయాన్ని ప్రభుత్వ సంస్థలు అందించలేకపోతున్నాయి. దాంతో ప్రజలు న్యాయంకోసం అన్యాయమైన, హింసాత్మక విధానాలపట్ల మొగ్గ చూపుతున్నారు. సమాజంలో చట్టపరమైన వ్యవస్థలు బలహీనమైనప్పుడు వాటిని కోర్టులు పునరుద్ధరించలేని పక్షంలో హింసే నిర్ణాయకశక్తిగా మారుతుంది.

చట్టపరమైన సంస్థలు న్యాయం అందించడంలో విఫలమైనప్పుడు హింస, దౌర్జన్యపూరిత విధానాలతో 'న్యాయం' అందించే అసాంఘికశక్తులు రంగంలోకి దిగే ప్రమాదం ఉంటుంది. వివాదాల పరిష్కారానికి, హక్కుల పునరుద్ధరణకు హింసాయుత పద్ధతులను అవలంభించడమే వాటి విధానం. ఇవన్నీ... సక్రమమైన మార్గంలో న్యాయం లభించకపోవడంతో తలెత్తే విపరిణామాలు. సమాజంలో హింసను అణచివేయాలంటే చట్టాన్ని, న్యాయాన్ని పునరుద్ధరించడం ముందుగా చేయవలసిన పని. పాలకులలో నిష్పాక్షికత, న్యాయబద్ధత ఉందని ప్రజలు విశ్వసించిన పక్షంలో ఎలాంటి కఠినతరమైన శిక్షలు వేసినా, అనుభవించేందుకు వారు వెనుకాడరు. ఆ నమ్మకం వారిలో సడలితే, అది హింసకు దారితీస్తుంది. అలాంటి హింసకు ప్రజల మద్దతు కూడా లభిస్తుంది.

ఫ్యాక్షన్ లీడర్లు, నేరగాళ్ళు రాజకీయాల్లోకి ఎందుకు వస్తున్నారనేది రెండో ప్రశ్న. స్వాతంత్ర్యం లభించి కొన్ని దశాబ్దాలు గడచినా ఆధునిక పోలీసు వ్యవస్థను మనం

అభివృద్ధి చేసుకోలేకపోయాం. నేర పరిశోధన ఇప్పటికీ రాజకీయ నాయకుల నియంత్రణలోనే కొనసాగుతుంది. అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల దయాదాక్షిణ్యాలపైనే పోలీసు అధికారుల బదిలీలు, నియామకాలు, చార్జిషీటు దాఖలు చేయడం లేదా కేసును ఎత్తివేయడం, విచారణ జరిపే తీరు... చివరకు రక్షణ కల్పించడం వంటి అన్ని విషయాలూ అధికారంలో ఉన్న నాయకుల ఇష్టాయిష్టాల ఆధారంగానే జరుగుతుంటాయి. నేర పరిశోధన, పోలీసుల విధి నిర్వహణపై నేతల నియంత్రణ తొలగిపోనంతవరకు ఫ్యాక్షన్ లీడర్లు, మాఫియా నాయకులు రాజకీయాధికారం కోసం అర్రులు చాచడం అనివార్యం. డబ్బు సంపాదనకు సులభమైన మార్గాలు కనబడుతున్నప్పుడు చట్టవ్యతిరేక శక్తులు రాజకీయాలవైపు మరింత ఎక్కువగా ఆకర్షితులవటం సహజం.

మూడో ప్రశ్న– ఫ్యాక్షన్ లీడర్లను, గూండాలను రాజకీయ పార్టీలు ఎందుకు ప్రోత్సహిస్తున్నాయి? మన ఎన్నికల వ్యవస్థలో ఒక అభ్యర్థి నయానో భయానో సమీకరించే ఓట్లే పార్టీల గెలుపోటములను నిర్ణయిస్తున్నాయి. ఫ్యాక్షన్ లీడర్లు, గూండాలకు కండబలం అండగా ఉంటుంది. అనుచరుల విశ్వాసమే వారికి బలం. హింసాయుత విధానాల ద్వారా, నేరాలకు పాల్పడటం ద్వారా ధనబలం సమకూర్చుకుంటారు. ఇక ఓ కులానిక లేదా వర్గానికి తమను తాము నాయకులుగా ప్రకటించుకుని చెలామణి అవుతుంటారు. వెనుకబడిన తరగతులవారికి పప్పూయాదవ్, ముస్లిములకు షాబుద్దీన్, ఠాకూర్లకు రజ్జూభయ్యా అలా నాయకులైనవారే. ఒకసారి కులం, ధనం, కండబలం ఏకమయ్యాయంటే వాటికి ఎన్నికల్లో తిరుగుండదు. పార్టీ శక్తియుక్తుల మీద కాకుండా అభ్యర్థుల అంగ, అర్థబలాలపై గెలుపోటములు ఆధారపడుతున్న ప్రస్తుత అపసవ్య ఎన్నికల వ్యవస్థలో పోటీ తీవ్రంగా ఉన్నప్పుడు ఫ్యాక్షన్ లీడర్లు, నేరగాళ్ళ మద్దతు తీసుకునేందుకు కూడా పార్టీలు వెనుకాడని దుస్థితి నెలకొంది.

పేరుమోసిన గూండాలు, ఫ్యాక్షన్ లీడర్లను ప్రజలు ఎందుకు ఎన్నుకుంటున్నారనేది చివరి ప్రశ్న. దీనికి కులం, ధనబలం కొంతవరకూ కారణం. వాస్తవమేమిటంటే– స్పందన కరవైన, మొద్దుబారిన పరిపాలన వ్యవస్థలో శాసనసభ్యులు సాధారణంగా సత్ఫలితాలు అందించలేకపోతున్నారు. ప్రస్తుత వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోయారు. సరైన దారిలో వెళ్లడం ద్వారా, బుజ్జగించడం, బతిమాలడం ద్వారా పనులు జరిగే రోజులు కావనే విషయాన్ని ప్రజలు అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నారు. నిర్లక్ష్యంగా,

బాధ్యతారహితంగా వ్యవహరించే పాలనా యంత్రాంగం కూడా నేరచరిత్ర కలిగిన ఓ ఎమ్మెల్యే అడిగితే ఠక్కున సానుకూలంగా స్పందిస్తుంది. అహింసాయుత విధానాల ద్వారా ఒరిగేదేమీ ఉండదన్న విషయాన్ని ప్రజలు గ్రహించారు. ప్రభుత్వంతో చర్చలకు వచ్చిన సందర్భంలో మావోస్టులకు ప్రజల నుంచి వందల సంఖ్యలో దరఖాస్తులు అందడం హింసాయుత విధానాల పట్ల పెరుగుతున్న ప్రజాదరణకు నిదర్శనం. ప్రజా సమస్యలపట్ల పాలనా యంత్రాంగం బాధ్యతారహితంగా ప్రవర్తించినంతకాలం రాజకీయ హింస ఆధిపత్యం చెలాయిస్తూనే ఉంటుంది. ఫ్యాక్షన్ లీడర్లకు, మాఫియా నేతలకు ప్రజలు ఓటు వేయడానికి ఇదే కారణం. రాజకీయ, పాలనా వ్యవస్థల్లో సంక్షోభం తలెత్తడానికి– సమాజంలో పెచ్చుమీరుతున్న హింస, నేర ప్రవృత్తిలతో పాటు రాజకీయాలు, హింస, నేరం, ఫ్యాక్షనిజాల మధ్య సంబంధాలు నానాటికీ బలపడటం కూడా కారణం.

## ఎవరు గెలిచినా ప్రజలు ఓడిపోతున్నారు

మార్పు పట్ల ప్రజల ఆశాభావం ప్రతి ఎన్నికలోనూ వ్యక్తమవుతోంది. మరింత మెరుగుదల సాధించాలన్న ఆకాంక్షకే ప్రతి తీర్పు అద్దం పడుతోంది. యథా ప్రజా, తథా ప్రభుత్వం అని కొందరు వాదిస్తుంటారు. కానీ, మన దేశంలోని కోట్లమంది సాధారణ ప్రజానీకం తన మనోగతమేమిటో ఎన్నోసార్లు మూకుమ్మడిగా వెల్లడించింది. వారు మూడు దశాబ్దాలుగా ప్రతి ఎన్నికలోనూ సగానికి పైగా ప్రతినిధులను తిరిగి ఎన్నుకోవడంలేదు. పటిష్ఠమైన ప్రభుత్వాలు, గట్టి నాయకులు, శక్తివంతులైన అభ్యర్థులు సైతం ఎప్పటికప్పుడు ప్రజాబలం ముందు పరాజితులుకాక తప్పడం లేదు. అయినా ప్రతిసారీ  ఆటగాళ్లు మారుతున్నారు తప్ప, ఆట నియమాలు మాత్రం మారడం లేదు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ఎప్పుడూ ప్రజలే ఓడిపోయే పరిస్థితి వచ్చేసింది. సమస్యలకు పరిష్కారం చూపాల్సిన రాజకీయ ప్రక్రియ స్వయంగా సమస్యగా మారింది. ఇలాంటి పరిస్థితిలో మురికి రాజకీయాలంటూ విమర్శలు గుప్పించడం, ఏ తప్పు జరిగినా పార్టీలను, రాజకీయవాదులనే తప్పు పట్టడం సులువు. కానీ, అంతా సక్రమంగా, నియమాలకు అనుగుణంగా భారత్‌లో రాజకీయాలు నడపటంమన్నది ఖరీదైన వ్యవహారం, ప్రమాద భూయిష్టం, పేరు ఫలితం రాని వ్యాపకం అని గ్రహించడానికి పెద్దగా కష్టపడనక్కర్లేదు. పిల్లలు రాజకీయాల్లోకి వస్తామంటే మనలో చాలామంది వద్దనేది అందుకే. ఎన్నో ప్రతికూలతలను ఎదుర్కొంటూ కూడా

రాజకీయాల ద్వారా ప్రజల బాగుకోసం పాటుపడేవారిని విమర్శించే విషయంలో మాత్రం మనం ఒకటికి రెండుసార్లు ఆలోచించం. మన రాజకీయ నాయకులంతా కడిగిన ముత్యాలని, వారు గొప్ప ప్రేమాభిమానాలు, శ్రద్ధాసక్తులు, నీతి నిజాయతీలతో ప్రజలకు సేవ చేస్తున్నారని ఎవరూ అనరు.

కానీ ప్రస్తుత రాజకీయాలని కేవలం విమర్శించడంవల్ల మనమూ సమస్యలో భాగంగా మారుతున్నాం తప్ప పరిష్కారానికి తోడ్పడటంలేదు. మనం మూడు ప్రశ్నలు వేసి, వాటికి వాస్తవిక సమాధానాలను కన్నుక్కోవలసిన అవసరం ఉంది. మొదటిది నీతి నిజాయతీలు, ప్రతిభాపాటవాలు, అంకిత భావం కలిగిన మన ఉత్తమ పౌరులు సక్రమ పద్ధతి ద్వారా ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యే పరిస్థితులు మనకిక్కడ ఉన్నాయా? దీనికి జవాబు చెప్పడానికి మనం పెద్దగా ఆలోచించనక్కర్లేదు. నీతి నిజాయతీలు, హుందాతనం కలిగిన వ్యక్తి అధికారపీఠాన్ని అధిష్టిస్తే నీతిమంతమైన పద్ధతులను అనుసరిస్తూ ఆ వ్యక్తి దీర్ఘకాలం పాటు పదవిలో కొనసాగగలరా అన్నది రెండో ప్రశ్న. గౌరవనీయులైన ఎంతోమంది నాయకులు ఎలాంటి దయనీయ పరిస్థితులను ఎదుర్కొన్నారో చూస్తే పదవిలో కొనసాగడమో, నిజాయతీగా ఉండటమో ఏదో ఒకటి మాత్రమే సాధ్యమని స్పష్టమవుతోంది. నీతిమంతుడు, హుందాతనంగల రాజకీయ నాయకుడు ఒకవేళ పదివిలో కొనసాగగలిగినా ఆయన విస్తృతస్థాయిలో స్థిరంగా, ధృఢంగా ప్రజా ప్రయోజనాలల కోసం పాటుపడగలరా అనేది మూడో ప్రశ్న. అలాంటి నాయకత్వాలు కలిగిన అనేక ప్రభుత్వాలు విఫలం కావడాన్ని, ప్రజలు వారిని తిరస్కరించడాన్ని బట్టి చూస్తే ఆ సర్కారులు చక్కని పనితీరును కనపరచలేదని స్పష్టమవుతుంది.

ఈ మూడు ప్రశ్నలకూ సంతృప్తికరమైన సమాధానాలు లభించనప్పుడు, రాజకీయ నాయకులు మెరుగైన పనితీరు కనపరచగలరని మన ఎలా ఆశించగలం? రాజకీయ నాయకులందరూ చెడ్డవారు కాదని ఇంగితజ్ఞానం ఉన్నవారెవరికీ వేరే చెప్పనక్కర్లేదు. నిజానికి వారిలో మర్యాదస్తులు, సమర్థులు, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చినవారూ ఉన్నారు. వారు బాగా పనిచేయలేకపోతున్నారంటే మన రాజకీయ వ్యవస్థలోనే ఎక్కడో ఏదో లోపం ఉన్నట్లే. వ్యక్తుల్ని నిందించడంలో అర్థంలేదు. ప్రజాస్వామ్యంకోసం కొంత మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని,

అది మనల్ని దిగజారుస్తుందని పదేపదే వినిపించే వాదనల్లో పసలేదు. ప్రజాస్వామ్యం, క్రమశిక్షణ పరస్పరం విరుద్ధమైనవి కావు. స్వేచ్ఛ అంటే ఏది పడితే అది చేయడానికి లైసెన్సు పొందడం వంటిది కాదు. మనం కోరుకుంటున్న వాటిలో చాలావరకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, ప్రజాస్వామ్యానికి అనుగుణమైనవే. ఏ విధంగా చూసినా, మనం హక్కులను అనుభవిస్తున్నాం. స్వేచ్ఛా సమాజంలో గరిష్ఠస్థాయిలో ప్రజా శ్రేయాన్నే ఆకాంక్షిస్తున్నాం. మరి సమస్యేమిటి? దానికి పరిష్కారం ఉందా?

## ప్రస్తుత ఎన్నికల వ్యవస్థతోనే అనర్థాలు

బ్రిటిష్‌పాలన వారసత్వాన్ని కొనసాగిస్తూ మనం ఎన్నికలకు సంబంధించి ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్ (ఎఫ్.పి.టి.పి) వ్యవస్థను ఎంచుకున్నాం. ఈ వ్యవస్థ ప్రకారం విజయానికి కొలమానం మెజారిటీయే. బ్రిటన్‌ను, ఒకప్పటి దాని వలస రాజ్యాలను మినహాయిస్తే దీర్ఘకాలంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్న ఏ సుస్థిర ప్రజాస్వామిక దేశంలోనూ ఎఫ్.పి.టి.పి. వ్యవస్థ లేదు. బ్రిటిష్ వలస రాజ్యాల్లోనే న్యూజిలాండ్ దామాషా ప్రాతినిధ్య (పి.ఆర్.) పద్ధతికి మారితే, అధునాతన ప్రత్యామ్నాయ ఓటింగ్ వ్యవస్థను ఆస్ట్రేలియా అనుసరిస్తోంది. అత్యంత ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే బ్రిటన్‌లో సైతం స్కాట్లాండ్, వేల్స్, ఉత్తరం ఐర్లాండ్ ప్రాంతీయ పార్లమెంటులను దామాషా ప్రాతినిధ్య పద్ధతుల్లోనే ఎన్నుకొంటున్నారు. బ్రిటన్‌లో హౌస్ ఆఫ్ కామన్స్‌కు మాత్రమే ఎఫ్.పి.టి.పి. పద్ధతిలో ఎన్నిక జరుగుతోంది. అయినా సరే, ఎఫ్.పి.టి.పియే సార్వత్రిక ఎన్నికల వ్యవస్థ అని మనం భావిస్తుంటాం.

విస్తృతస్థాయిలో నిరక్షరాస్యత, పేదరికంతో కూడుకొన్న సువిశాల, విభిన్న ప్రజాస్వామిక దేశానికి ఎఫ్.పి.టి.పి. తగిన వ్యవస్థ కానేకాదు. మన వ్యవస్థలో ఒక నియోజకవర్గంలో అభ్యర్థి విజయాన్ని మెజారిటీయే నిర్ణయిస్తుంది కనుక, మెజారిటీ సాధించిపెట్టే ఓట్లకోసం విపరీతమైన పోటీ ఉంటుంది. ఓట్లను కొనడానికి, ఓటర్లకు ఏవో ఆశలు చూపి తమ వైపునకు తిప్పుకోవడానికి, కిరాయి రౌడీలను నియమించుకోవడానికి పెద్ద యెత్తున డబ్బును వ్యయం చేయడం మామూలేపోయింది. భారీగా డబ్బు ఖర్చుపెట్టినంత మాత్రాన గెలుస్తారన్న గ్యారంటీ ఉండదు. కానీ తక్కువగా ఖర్చుపెడితే మాత్రం ఓటమి ఖాయం. ఈ పరిస్థితి అవినీతికి, అధికార దుర్వినియోగానికి దారి తీస్తోంది. అధికారుల బదిలీలు నియామకాలు, కాంట్రాక్టుల ఖరారు. నేరపరిశోధనలో జోక్యం వంటి విషయాల్లో అధికారాన్ని ఎక్కువగా

చలాయించుకోవడం జరుగుతోంది. గెలిచేది ఎవరైనా సత్పరిపాలన మాత్రం అసాధ్యమైపోయింది.

పరిస్థితి ఇలా ఉండటంతో నిజాయతీపరులు, సమర్థులైనవారు రాజకీయాలకు దూరంగా ఉండిపోతున్నారు. రాజకీయాల్లో చేరినా అణచివేతకు గురవుతున్నారు. ధనబలం, కండబలం, కులం బలం, కుటుంబ బలం కలిగిన అభ్యర్థులవైపే పార్టీలు మొగ్గుచూపుతున్నాయి. అక్కడక్కడ వెదజల్లినట్లుండే మైనారిటీలను పక్కన పెట్టి స్థానికంగా కేంద్రీకృతంగా ఉండే కులాల వారికి అవసరానికి మించి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎఫ్‌పిటిపి పద్ధతిలో ఓడిపోయిన అభ్యర్థులకు పడే ఓట్లకు విలువే లేదు. 30–35 శాతం లోపు పడే ఓట్లను సీట్లుగా తర్జుమా చేసే సదుపాయం ఎఫ్.పి.టి.పి. పద్ధతిలో లేకపోవడంతో జాతీయ పార్టీలు నానాటికీ కుంచించుకుపోతున్నాయి.

మనదేశంలోని అతిపెద్ద రాష్ట్రాలలో పరిస్థితే తీసుకొంటే వాటిలో ఒక దానిలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు చాలా రాష్ట్రాలలో కీలక స్థాయిలో లేవు. విజయాన్ని పునర్ నిర్వచించడంలోనూ, ప్రజల మద్దతు ప్రాతిపదికగా న్యాయబద్ధ ప్రాతినిధ్యం కల్పించడంలోనూ దీనికి సమాధానం ఉంది. అలాంటి దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో ఒక పార్టీ ఏ రాష్ట్రంలోనైనా తన ఓట్ల వాటాకు అనుగుణంగా సీట్లు పొందగలుగుతుంది. హుందాతనంగల, మర్యాదస్తులైన అభ్యర్థులను సభ్యులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపిక చేయగలుగుతారు. పార్టీ జాబితా ఎన్నికకు ప్రాతిపదికగా ఉంటుంది. ఓట్లలో కనీస శాతాన్ని ప్రాతినిధ్యానికి అర్హతగా నిర్ణయిస్తే సబబుగానే ఉంటుంది. కులం ఆధారంగా పార్టీలు కుంపట్లు పెట్టకుండా దానివల్ల నిరోధించినట్లవుతుంది. అనేక రాష్ట్రాల్లో ఉనికి లేకుండా పోయిన జాతీయ పార్టీలు, ఆ రాష్ట్రాల్లో తిరిగి ప్రాబల్యం పొందడానికి దామాషా ప్రాతినిధ్య పద్ధతి దోహదపడుతుంది. ఈ విధమైన ఏర్పాటు అన్ని పార్టీలకూ మంచిది. మనందరికీ మంచిది. దీనివల్ల రాజకీయాధికారంతో పాటు నీతి నియమాలూ మనగలుగుతాయి. ప్రభుత్వాలు ప్రజోపయోగ పనులు చేయగలుగుతాయి.

కోల్పోయిన ప్రజాస్వామ్యాన్ని మనం తిరిగి సాధించాల్సిన అవసరం ఉంది. మన ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉంది. మన యువత ఆత్మవిశ్వాసంతో ఉంది. మన ప్రజలు మెరుగైన పరిపాలనను కోరుకుంటున్నారు. కార్యాచరణకు ఉపక్రమించాల్సిన సమయమిదే. ◆

# కేంద్రీకృత పాలనే అనర్థాలకు మూలం

## ప్రజల భాగస్వామ్యంతో సత్ఫలితాలు

పాలనలో వివిధ అంచెలలో అధికారాలను బాధ్యతలను సమంగా పంచకపోతే జరిగేది అరిష్టమే. రాష్ట్రస్థాయిలో సమర్థంగా నిర్వహించి, సమన్వయం చేయాల్సిన అంశాలు కొన్ని ఉంటాయి. ఏ ఊరికాఊరిలో సమర్థంగా నిర్వహించుకునే అంశాలు మరికొన్ని ఉంటాయి. పెద్ద ప్రాజెక్టులు, నదీ జలాల వినియోగం, విద్యుత్ రంగంలో పనితీరు మెరుగుదల ఇలాంటి విషయాలలో విధాన నిర్ణయాలు, అమలు రాష్ట్రస్థాయిలోనే సాధ్యం. వాటిలో కూడా కొన్నింటిని ఏ ఊరికాఊరిలో, లేదా పట్టణంలో, మండలంలో చేపట్టవచ్చు. ఉదాహరణకు సాగునీటి కాలువల నిర్వహణను స్థానిక నీటి వినియోగాన్ని రైతు సంఘాలకే అప్పగించవచ్చు. విద్యుత్ పంపిణీ నిర్వహణను సబ్ స్టేషన్ స్థాయిలోను, ఫీడర్ స్థాయిలోను సమర్థంగా, అవినీతికి తావులేకుండా చేపట్టవచ్చు. కేంద్రీకరించటం వల్ల పంపిణీ వ్యవస్థను బాగుచేయలేం. ఇలా ప్రతిరంగంలోను, అందులో ఇమిడిఉన్న సాంకేతిక, ఆర్థిక అంశాలను బట్టి, వివిధ సంస్థల మధ్య సాధించవలసిన సమన్వయాన్ని బట్టి, కొన్ని విధులను స్థానికంగా నిర్వహించేలా వికేంద్రీకరించటం, మరికొన్ని విధులను కేంద్రీకరించటం, పరిపాలన సామర్థ్యాన్ని పెంచుతుంది. అలా విధులను వికేంద్రీకరిస్తే స్థానికంగా జరిగే తప్పొప్పులకు అక్కడ ఎన్నుకున్న స్థానిక ప్రభుత్వాలు, వారి అజమాయిషీలో పనిచేసే సిబ్బంది బాధ్యత వహిస్తారు. అధికారం, బాధ్యత ఒకేచోట మిళితమై ఉంటాయి. అక్కడి ప్రజలు, పౌరసమాజం, ఉద్యమాలు ఆ స్థానిక ప్రభుత్వంతో సంప్రదించి, అక్కడికక్కడ అవసరమైన మార్పులను చేపట్టగలరు; తప్పులను సవరించగలరు. ఆ విధంగా తమ ఊళ్ళో పరిస్థితులను తామే చక్కదిద్దుకోగలమనే నమ్మకం అక్కడి ప్రజలకుంటుంది. అలాకాక గ్రామంలోనో, పట్టణంలోనో జరగవలసిన ప్రతిపనికీ దూరంగా ఉన్న 'పై' వాళ్ళను 'దేహీ' అని యాచించాల్సి వస్తే, ప్రజలలో ప్రభుత్వంపట్ల విశ్వాసం సన్నగిల్లి నిరసన పెరుగుతుంది. ఆ నిరసన ద్వేషంగా మారటానికి అట్టేకాలం పట్టదు. ఆ ద్వేషం నుంచే హింస పుడుతుంది. పాలన వ్యవస్థనుంచి పౌరులను

దూరం చేయడమే హింసాత్మక ఉద్యమాలకు ప్రధానమైన కారణం. ఒక ఇంట్లో కూడా కొందరు కుటుంబ సభ్యులకు ఏ మాత్రం గౌరవం ఇవ్వకపోతే, వారికి ఏ బాధ్యతలు అప్పగించకుండా చిన్నచూపుచూస్తే, ఎందుకూ కొరగాని వారిలా చూస్తూ వారిని ఆ కుటుంబ యజమానే అన్ని విషయాలలోను శాసిస్తూ ఉంటే, ఆ కుటుంబంలో ముసలం పుట్టడం ఖాయమే. అప్పుడు కొందరు పిల్లలు ప్రతి దానికి ఎదురు తిరగటం, సందర్భం లేకుండా తిరగబడటం, పెడధోరణులకు పాల్పడటం, అన్నింటిని విచ్ఛిన్నం చేయటం మనందరికి నిత్యజీవితంలో అనుభవమే. రక్తసంబంధం, ఎన్నో మమతానురాగాలు ఉన్న కుటుంబంలోనే సరైన గౌరవం, పాత్ర కల్పించకపోతే, చులకన చేస్తే ఆ ఇల్లంతా చిందరవందరై నరకప్రాయమవుతుంది. అలాంటప్పుడు ఎన్నో వైవిధ్యాలతో, ఎన్నో కులాలు, వర్గాలతో నిండిన సమాజంలో, ఎక్కడికక్కడ స్థానిక ప్రజల ప్రమేయంతో నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించకపోతే ఆ వ్యవస్థ నుంచి సామాన్యులు దూరమవుతారు. ఈ ఎడబాటు నుంచి నిస్తేజం, హింజ పుట్టడం సహజం. జరిగే ప్రతి దుష్పరిణామానికి నిర్ణయాధికారం ఉన్న వారిమీద క్రోధం, కసి పెరుగుతాయి. వ్యవస్థమీద నమ్మకం కరవవుతుంది. తద్భిన్నంగా స్థానికంగా నిర్ణయాలు జరిగితే, పరిస్థితులను చక్కదిద్దే అవకాశం అందరికీ లభిస్తుంది. అప్పుడు దూరంగా ఉన్న వాళ్లెవరూ దుర్మార్గులుగా కనిపించరు.

## గతం నేర్పిన పాఠాలు

దూరంగా ఉన్న కేంద్రీకృత ప్రభుత్వంలో పనులన్నీ చక్కగా జరుగుతున్నాయి అంటే, అవినీతి, అసమర్థత, అక్రమాలు ఎంతగా చోటుచేసుకుంటున్నాయో అందరికీతెలుసు. ఏరోజు ఏ పత్రికను తిరగేసినా మన వ్యవస్థలోని వైఫల్యాలు కళ్లకు కనబడుతున్నాయి. అయోధ్యలోని వివాధాన్నే పరిశీలిస్తే, కేవలం ఓ ఊరికే, లేదా ఫైజాబాద్ జిల్లాకు పరిమితం కావలసిన ఓ చిన్న స్థానిక సమస్య నేడు పరిష్కారానికి అనువుగాని ఓ జాతీయ సమస్యగా తయారయింది. 1989 దాకా మనకెవరికీ అసలు ఫైజాబాద్ జిల్లా ఉందని, అక్కడ సరయూనది ఉందని, దాని ఒడ్డున అయోధ్య పట్టణం ఉందని, అక్కడ రామ జన్మభూమి–బాబ్రీ మసీదు వివాదం ఉందని తెలియదు. దక్షిణాది తూర్పు, పశ్చిమరాష్ట్రాలలో దాన్ని గురించి ఉసేలేదు. ఎక్కడికక్కడ నిజాయితీగా నిర్ణయాలు తీసుకునే అవకాశమివ్వకుండా దాన్ని కేంద్రీకృతం చేయటంతో ఆ వివాదం దేశానికే గుదిబండ అయింది.

సుప్రీంకోర్టు రాజ్యాంగాన్ని విశ్లేషించి, ముస్లిం మహిళలకు విడాకుల తరవాత తగిన మనోవర్తి ఇవ్వాలని తీర్పును ఇచ్చినప్పుడు నాటి రాజీవ్ ప్రభుత్వం దానిలో వేలుపెట్టకుండా ఉంటే అసలు ఈ సమస్యే తలెత్తేదికాదు. చట్టాలను అమలుచేయటం తన బాధ్యత అని, రాజ్యాంగాన్నీ విశ్లేషించటం న్యాయస్థానాల బాధ్యత అని గుర్తించి, తన పరిధిలోపల తన విధిని నిర్వహిస్తే ఏ బెడదా లేకుండా ఉండేది. అలా కాక కోర్టు తీర్పును తలకిందులు చేయటం వల్ల తేనెతుట్టెను కదిలించినట్లయింది. పోనీ అప్పుడయినా చట్టంచేసే పూర్తి విచక్షణను పార్లమెంటుకు వదిలేస్తే, పార్టీలకు అతీతంగా సభ్యులు నిర్ణయం చేసేవారు. అలాకాక మూల్లాల ఒత్తిడికి లొంగి, విప్‌ను ప్రయోగించి, ప్రభుత్వం పార్లమెంటు సభ్యుల అభిమతాన్ని అణగదొక్కింది. ప్రభుత్వ మనుగడతో సంబంధంలేని, పార్టీ ఎన్నికల ప్రణాళికకు అతీతమైన ఇలాంటి అంశంలో కేవలం మంత్రివర్గం నిర్ణయంచేసి పార్లమెంటు సభ్యుల స్వేచ్ఛను హరించటంతో మతఛాందసులకు లొంగిపోయే చట్టం వచ్చింది. ఆ తరవాత హిందూ మత ఛాందసులను సంతృప్తి పరచటంకోసం అయోధ్యలోని స్థానిక వివాదంలో జాతీయ ప్రభుత్వం తలదూర్చింది. అక్కడి అధికారులు, న్యాయస్థానాలు తీసుకోవాల్సిన నిర్ణయాన్ని ఢిల్లీలో తీసుకోవటంతో సమస్య 'అయ్యవారిని చెయ్యబోతే కోతిలాగా' తయారయింది.

అధికార కేంద్రీకరణ వల్ల ఎదురయ్యే అరిష్టాలకు ఈ ఉదంతం ఓ సజీవ సాక్ష్యం రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా వ్యవహరిస్తున్నాయా అంటే అదీ లేదు. స్థానిక ప్రభుత్వాలకు వాటి బాధ్యతలను అప్పగించినా ఎన్నో కీలకమయిన నిర్ణయాలు, బాధ్యతలు రాష్ట్రం చేతుల్లో ఉన్నాయి. శాంతి భద్రతలను కాపాడటం, చట్టబద్ధ పాలనను నిర్వహించేందుకు పరిస్థితులను కల్పించటం, సకాలంలో సమర్థ న్యాయాన్నందించే ఏర్పాట్లు చేయటం రాష్ట్ర ప్రభుత్వపు ప్రథమ కర్తవ్యాలు. అసలు చేయవలసిన పనుల మీద దృష్టిని సారించకుండా అనవసర విషయాలలో జోక్యం చేసుకోవటంతో ప్రభుత్వం తన మౌలిక విధులలో విఫలమవుతోంది. రాయలసీమలో ముఠాకక్షలు, ఎన్నో పట్టణ ప్రాంతాలలో విజృంభిస్తున్న మాఫియాలు, అదుపు తప్పిన తీవ్రవాద ఉద్యమాలు ప్రభుత్వ వైఫల్యానికి తిరుగులేని తార్కాణాలు. మన వ్యవస్థ 'బడితె ఎవరి చేతిలో ఉంటే బర్రె వాడిదే' చందంగా ఉంది. కాంట్రాక్టులు, టెండర్లు, బదిలీలు, పోస్టింగులు–

అన్నింటిలో ఆశ్రిత పక్షపాతం, అవినీతి తాండవిస్తున్నాయి. వాటిని అరికట్టే సామర్థ్యం ప్రభుత్వానికి లేకుండా పోయింది. చట్టాన్ని బట్టికాక, వ్యక్తుల ఇష్టాయిష్టాలను బట్టి పాలన సాగుతోంది. నిర్ణయాలు ప్రజాసంక్షేమం కోసం కాక, కొందరు పెత్తందార్ల కనుసన్నల మేరకు అమలవుతున్నాయి. ఇక న్యాయం విషయానికి వస్తే మన కోర్టులలో తమ హక్కులను పరిరక్షించుకోవచ్చుననే విశ్వాసం సామాన్యులకు ఏ మాత్రం లేకుండా పోయింది. కేవలం డబ్బున్న వారికి ఏళ్లతరబడి పడిగాపులు కాచే శక్తి ఉన్న వారికి న్యాయం ఎండమావిగానే మిగులుతోంది. దాంతో కండబలంతో బండన్యాయం అందించే గూండాలకు, మాఫియాలకు గిరాకీ పెరిగిపోయింది. ఆ గూండాలే 'తొండముదిరి ఊసరవెల్లి'గా మారినట్లు అనతికాలంలో రాజకీయావతార మెత్తుతున్నారు. ఈ మొత్తం అవ్యవస్థకు కారణం కేంద్రీకృతపాలనే. వాటిని మనప్రభుత్వాలు ఏ మాత్రం జీర్ణించుకోకపోవటంతో ఇంతటి అనర్థం వాటిల్లింది. అలాగే, అందరికీ మంచి ప్రమాణాలతో విద్య, ప్రాథమిక ఆరోగ్యం అందించడం కోసం సరయిన విధానాలు రూపొందించటం, పథకాలు రచించటం, వనరులు కేటాయించటం ప్రభుత్వ విధి. ఆధునిక ప్రపంచంలో నాగరికతకు అర్థం అదే. స్థానిక సమస్యలలో నిరంతరం జోక్యం చేసుకునే రాష్ట్ర ప్రభుత్వానికి తమ విధుల నిర్వహణలో చేవ, సామర్థ్యం కొరవడ్డాయి. దాంతో విద్య, ఆరోగ్యం అధ్వానంగా తయారయ్యాయి. సహజ వనరుల అభివృద్ధి జరిగినప్పుడే సంపద సృష్టి, ఉపాధి కల్పన సాధ్యం. మన పాలకుల వైఫల్యం పుణ్యమా అని లక్షల ఎకరాలు సాగుకు నోచుకోలేపోతున్నాయి. నీటిని సద్వినియోగం చేయటంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం ఏ చిన్న ప్రకృతివైపరీత్యాన్నీ ఎదుర్కోలేక పొరుగు రాష్ట్రాలతో కయ్యానికి కాలు దువ్వుతోంది.

## పాలకులు చేయాల్సిందేమిటి?

అటు ప్రజలకు ఎన్నికయిన స్థానిక ప్రభుత్వాలకు స్వేచ్ఛ లేకుండా కేంద్రీకృత నిర్ణయాలు తీసుకోవటం వల్ల పౌరులు ప్రభుత్వానికి దూరమవుతున్నారు; నిరసన, హింస పెరుగుతున్నాయి. ప్రభుత్వం తాను చేయవలసిన పనులు సరిగ్గా నిర్వహించక పోవటంతో సమాజానికి విపరీత నష్టం వాటిల్లుతోంది; ఆర్థిక ప్రగతి కుంటుపడుతోంది. చివరికీ ఈ కోపం, కసి, ద్వేషం– అన్నీ అధికారాలను కేంద్రీకరించిన పాలకుల

మీద పడుతున్నాయి. ఈ కేంద్రీకరణ ఎవరికీ శ్రేయస్కరం కాదు. జనాభీష్టాన్ని మన్నించి ఇప్పటికైనా ప్రజాస్వామ్యస్ఫూర్తితో స్థానిక ప్రభుత్వాల సాధికారిత కోసం ప్రభుత్వం ఉపక్రమించటం శ్రేయస్కరం. అలాకాక ప్రధాన పార్టీలు హ్రస్వదృష్టితో అధికారాలు పంచటానికి విముఖత చూపితే అసలు అధికారం మీద ఆశలే వదులుకోవలసి వస్తుంది. ప్రజలను ప్రభువులుగా గుర్తించి, స్వపరిపాలనకు సార్థకత చేకూరుస్తారో; కేంద్రీకృత దుష్పరిపాలనను కొనసాగించి సమాజంలో అన్యాయానికి, హింసకు మరిన్ని బీజాలు వేస్తారో– ప్రజలు వేయి కళ్ళతో గమనిస్తున్నారు. వంకలతో, తీపికబుర్లతో ప్రజలను కలకాలం మభ్యపెట్టటం సాధ్యంకాదు. ◆



**" ఎందుకు చెత్తంతా ఎత్తేస్తున్నారు. ముఖ్యమంత్రిగారేమన్నా సర్‌ప్రైజ్ ఇన్‌స్పెక్షన్‌కి వస్తున్నారా?"**

# సాధికారత లేని స్థానిక ప్రభుత్వాలు

గతంలో 'స్థానిక ప్రభుత్వాల సాధికారతా సమాఖ్య,' 'లోక్‌సత్తా'లు రాజ్యాంగ స్ఫూర్తి మేరకు స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, బాధ్యతలను పంచాలని కోరుతూ కోటి సంతకాల ఉద్యమాన్ని నిర్వహించాయి.

## మౌలిక అవసరం

ఓ అంచె నుంచి మరో అంచెకు శాశ్వత అధికారాల పంపిణీ అనేది అత్యంత కీలక రాజకీయ సమస్య. తెల్లదొరల నుంచి అధికారం మనమెన్నుకున్న నేతలకు బదిలీకావటం మన ప్రజాస్వామ్య పరిణామక్రమంలో తొలి మజిలీ. అయితే స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో దేశం ముక్కలు కావటం, ఆ సమయంలో అసాధారణ రీతిలో రక్తపాతం జరగటం వల్ల అధికారాలను చాలా మేరకు యూనియన్ స్థాయిలో దేశ రాజధాని ఢిల్లీ చేతుల్లో ఉండేలా రాజ్యాంగాన్ని తయారుచేశారు. పేరుకు భారత్‌ను రాష్ట్రాల సమాఖ్యగా వర్ణించినా, రాష్ట్రాలకే సరైన అధికారాలు పంపిణీ చేయకపోవటంతో రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో తప్ప స్థానిక ప్రభుత్వాల ఊసే లేకుండాపోయింది. రాజ్యాంగం అమలులోకి వచ్చాక నాలుగు దశాబ్దాలకు పైగా రాష్ట్రాలకు న్యాయమైన అధికారాల పంపిణీ కోసం దేశంలో వివిధ రూపాలలో పోరాటం జరిగింది. బొమ్మై కేసులో సుప్రీం కోర్టు తీర్పుతో 356వ అధికరణం దుర్వినియోగానికి తెరపడటం, 10వ ఆర్థిక సంఘం తొలిసారిగా అన్ని యూనియన్ పన్నులలోను రాష్ట్రాలకు సమాన వాటాను కేటాయించటం, జాతీయస్థాయిలో ఏక పార్టీ పాలన అంతమై ప్రాంతీయ పార్టీల పొత్తులో సంకీర్ణ ప్రభుత్వాలు అనివార్యం కావటం, ఆర్థిక సంస్కరణలలో భాగంగా ప్రభుత్వ రంగ పెట్టుబడులలో యూనియన్ ప్రభుత్వానికున్న విచక్షణాధికారాలు అంతం కావటం, లైసెన్సు – పర్మిటు – కోటా రాజ్యం స్థానంలో స్వేచ్ఛా వాణిజ్యం, ఆర్థిక రంగంలో నిజమైన పోటీ చోటు చేసుకోవటం తదితర కారణాల వల్ల యూనియన్ – రాష్ట్రాల సంబంధాలలో చాలా వరకు సమతూకం సాధ్యమయింది. సమాఖ్య స్ఫూర్తి మేరకు, ఫెడరలిజానికి అనుగుణంగా రాష్ట్రాలకు అధికారాల బదిలీ పూర్తి కావచ్చింది. 1991 నుంచి 1996 నుంచి బాధ్యతలను చేపట్టిన సంకీర్ణ ప్రభుత్వాలు చాలా విచక్షణతోను,

ముందుచూపుతోను వ్యవహరిస్తున్నాయి. గతంలోలాగా రాష్ట్రాలను చిన్నచూపు చూడటం గాని, నిర్ణయాలను ఢిల్లీలో తీసుకోవటం గాని ఇక సాధ్యం కావు. చాలా మేరకు రాష్ట్రాల రాజకీయ, ఆర్థిక భవిష్యత్తు అక్కడి సర్కార్ల చేతుల్లోనే ఉంది. అధికారాల పంపిణీ వల్ల వాస్తవానికి జాతీయ స్థాయిలో ప్రభుత్వం బలహీనం కాకపోగా బలపడింది. కేంద్రీకృత పాలన స్థానంలో వ్యక్తి స్వేచ్ఛ, వికేంద్రీకరణ ఆధారంగా రాజ్య వ్యవస్థను నిర్మిస్తే ఆర్థిక ప్రగతి ఎలా సాధ్యమో, దేశం ఎలా మరింత సంఘటితమవుతుందో గత దశాబ్ద కాలంలో సంభవించిన పరిణామాలు రుజువు చేశాయి. ఇంకా కొన్ని అంశాలలో యూనియన్ పెత్తనం అంతం కావలసి ఉంది. కాని మొత్తం మీద రాష్ట్రాల విషయంలో సమాఖ్య స్ఫూర్తి వాస్తవరూపం దాల్చింది. అధికారాల పంపిణీలో రెండవ మజిలీ పూర్తి కావచ్చింది.

దేశంలో పాలన వ్యవస్థ నిజంగా పౌరులకు చేరువగా ఉండటం కోసం మూడో అంచెలో అధికారాల పంపిణీ జరగాల్సి ఉంది. స్వతంత్ర పోరాటం ఎంత ఉదాత్తమయినదో, రాష్ట్రాలకు అధికారాల పంపిణీ ఎంత కీలకమయినదో, స్థానిక ప్రభుత్వాల సాధికారత మన ప్రజాస్వామ్య మనుగడకు అంతే మౌలికమయిన అవసరం. ఇది దీర్ఘకాల పోరాటం. రాష్ట్రాలు తమ చేతుల్లో ఉన్న అధికారాలను స్థానిక ప్రభుత్వాలకు పంపిణీ చేయటానికి సమ్మతించవు. శాసనసభ్యులు, అధికారులు ఒక పట్టాన స్థానిక ప్రభుత్వాల సాధికారతకు అంగీకరించరు. మాటలలో సూత్రప్రాయంగా అధికారాల బదిలీకి ఒప్పుకొన్నా, అవి వాస్తవ రూపం దాల్చడానికి ఎంతో పోరాటం జరగాల్సి ఉంది.

రాష్ట్రాల్లోని మంత్రులు కూడా ఒకే ఒరవడిలో అధికారాన్ని చెలాయించటానికి ఇంతకాలం అలవాటు పడ్డారు. గ్రామ, పట్టణ స్థాయిల్లో పూర్తి కావలసిన పనుల్ని రాష్ట్ర స్థాయిల్లో నిర్ణయం చేస్తూ, పెత్తనమంతా తమదేనన్నట్లుగా సాధారణ ప్రజలకు చూపటం మంచి పరిపాలనగా చెలామణి అవుతోంది. శాంతిభద్రతల పరిరక్షణ, చట్టబద్ధపాలన, సకాలంలో సరైన న్యాయం, ప్రజలందరికీ విద్య, ఆరోగ్యం సజావుగా అందించటం కోసం – సరైన విధానాలు, పద్ధతులు, సహజ వనరుల అభివృద్ధి, రాష్ట్రస్థాయిలో మౌలిక సదుపాయాలు, సాంఘిక భద్రత – ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వాలు

చేపట్టవలసిన విధులు, వాటిని చాలా మేరకు నిర్లక్ష్యం చేసి ప్రభుత్వాలు స్థానిక విషయాలలో అనవసరంగా జోక్యం చేసుకుంటున్నాయి. బదిలీలు, పైరవీలు, అస్మదీయుల కోసం కాంట్రాక్టుల ఖరారులు, నేర పరిశోధనలో జోక్యం – వంటివాటిలో మునిగిపోతున్నాయి.

కేంద్రీకరణను, విధుల నిర్లక్ష్యాన్ని అంతమొందించడమంటే మాటలు కాదు. మన రాష్ట్రం సహా చాలా రాష్ట్రాలలో అన్ని పార్టీల సర్కార్లకూ కేంద్రీకృత పోకడలు అలవాటైపోయాయి. ఇప్పుడు ఆ పద్ధతిని మార్చాలన్న ఆలోచన వచ్చినా – శాసనసభ్యులను సంతోషపరచకపోతే పదవీ గండం తప్పదేమోనన్న భయం, అధికార యంత్రాంగం వ్యతిరేకిస్తే అదుపు చేసే సత్తాలేని బలహీనత, స్థానికంగా అన్నీ తాము చేస్తున్నట్లు కనిపించకపోతే ఓట్లు పడవేమోనన్న గాభరా, అసలు తాము చేయవలసిన ఎన్నో పనులను నిర్లక్ష్యం చేయడం వల్ల జనహితం కుంటుపడుతోందని గ్రహించలేకపోవడం... అధికార వికేంద్రీకరణకు అడ్డుగోడలయ్యాయి.

ఈ అవరోధాలను తొలగించాలంటే, అధికార వికేంద్రీకరణను కేవలం ఓ సిద్ధాంతంగా కాక – ప్రజల సమస్యగా ముందుకు తీసుకురావాలి. ప్రజావసరాలను తీర్చేందుకు దీనినో కీలకమయిన ప్రక్రియగా పౌరులు గుర్తించాలి. వికేంద్రీకరణ కోసం ప్రజలనుంచి పెద్దయెత్తున మద్దతును సమీకరించి, దానినో కీలకమయిన అంశంగా రాష్ట్రప్రభుత్వాల్లో స్పృహ కలిగించాలి. శాసనసభ్యులను మంచి చేసుకుని అధికార కేంద్రీకరణతో పబ్బం గడుపుకోవాలని ఆరాటపడుతున్న రాష్ట్ర సర్కార్లకు – అధికారాలను మూడో అంచెలోని ప్రభుత్వాలకు పంచకపోతే పదవీగండం తప్పదని అర్థం కావాలి.

## చిత్తశుద్ధి ముఖ్యం

రాజకీయం అధికార క్రీడ కారాదు. ఎన్నికలు ప్రజల భవిష్యత్తును, రాజ్య వ్యవస్థ నడిచే తీరును నిర్ణయించే ప్రక్రియగా మారాలి. అందుకే ఈ ఎన్నికలను మూడో అంచెకు బాధ్యతలను బదిలీ చేయటానికి, విధి నిర్వహణలో జవాబుదారీతనం పెంచటానికి సరైన అవకాశంగా మనం మలుచుకోవాలి. రాష్ట్ర మంత్రివర్గాలు రాజ్యాంగంలోని 11, 12వ షెడ్యూళ్ల ప్రకారం అధికారాలను బదిలీ చేయాలని అనేకమార్లు తీర్మానం చేశారు. అయితే అలవాటు ప్రకారం మాటలకు, చేతలకు మధ్య పొంతన లేకుండా పోయింది. కొన్ని ప్రభుత్వ ఆదేశాలు వెలువడినా చాలా

వరకు అవి మొక్కుబడిగానే జరిగాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఎ)కు అధ్యక్షుడుగా జిల్లా పరిషత్తు అధ్యక్షుణ్ణి నియమించటం, మార్కెటింగ్ శాఖ అధికారులను జిల్లా పరిషత్తు సి.ఇ.ఓ. అధీనంలో ఉంచటం లాంటివి అవసరమైన, కేవలం లాంఛనప్రాయమైన ఏర్పాట్లు, మిగిలిన ఆదేశాలన్నీ కంటితుడుపు చర్యలే. ఇవి చాలవు. ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. లేదా ప్రజల తీర్పునకు సంసిద్ధం కావాలి. కోటి సంతకాల ఉద్యమం విజయవంతమయినప్పుడు, "అయితే అధికారాలను పంచండి. లేదా అధికారం పైన ఆశ వదులుకోండి" అనే నినాదం కారణంగా ప్రభుత్వంలో కదలిక వచ్చింది.

ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం ఇక వెంటనే స్థానిక ప్రభుత్వాలకు బాధ్యతలను బదిలీ చెయ్యాలి. అందుకు నాలుగు కారణాలున్నాయి. మొదటిది. కోటి మంది కదలి వచ్చాక, వారి అభీష్టాన్ని విస్మరిస్తే అసలుకే మోసం వస్తుంది. శాసనసభ్యుల ప్రాభవాన్ని తగ్గిస్తే తమ ప్రభుత్వమే పతనమవుతుందనే శంకకు ప్రతిగా, ఓటర్ల మాటను పట్టించుకోకపోతే ఎన్నికలలో ఖాయంగా ఓడిపోతామనే భయం పనిచెయ్యాలి. అందుకు పౌర సమాజం, స్థానిక ప్రభుత్వాలు పార్టీలకతీతంగా పూనుకోవాలి.

రెండవది : ఈ ఎన్నికలలో అక్రమ ఖర్చు లేకుండా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అధికార పార్టీ వారు ప్రకటనలిస్తున్నారు. వారి చిత్తశుద్ధిని మనం శంకించకపోయినా, ప్రజలకు తమ ఓటు విలువ తెలియనంత వరకు డబ్బుకు, సారాయికి ఓట్లను అమ్ముకోవటం కొనసాగుతుంది. తాము వేసే ఓటుకు తమకు జరిగే మంచికి మధ్య సంబంధం అర్థం కావాలంటే అధికార వికేంద్రీకరణ అవసరం. కాబట్టి, ఎన్నికలలో అక్రమ ఖర్చును, డబ్బు సంచుల పాత్రను క్రమక్రమంగా తగ్గించాలంటే ఇప్పుడే స్థానికంగా బాధ్యతల బదిలీకి ఉపక్రమించాలి.

మూడోది: రెండు ప్రధాన పార్టీలకూ అసెంబ్లీ సీట్ల పంపిణీలో ఎన్నో ఇబ్బందులున్నాయి. ఉన్న శాసనసభ్యులలో సగం మందినయినా తొలగించకపోతే ఓడిపోతామన్న భయం అధికార పార్టీకి  ఉన్నట్లు తెలుస్తోంది. అవినీతి వల్లనో, ఇతర కారణాలతోనే శాసనసభ్యులు చాలామంది గెలిచే పరిస్థితి లేదు. వారిని తొలగించకపోతే ప్రజలే ఓడిస్తారు. వారికి సీట్లు ఇవ్వకపోతే, వారే తిరుగుబాటు చేసి పార్టీని ఓడించే ప్రమాదముంది. అలాగే సీట్లకోసం పోటీపడి అవి పొందని వారికి పదవుల పందేరం చేయటం కోసం కాంగ్రెస్ పార్టీ శాసన మండలిని

పునరుద్ధరిస్తామని, ఇంకా వేలాది నామినేటెడ్ పదవులలో నియమిస్తామని ప్రకటనలిస్తోంది. పార్టీల కోసం కష్టపడే కార్యకర్తలను, పదవులు రాక నిరాశపడ్డ వారిని తృప్తిపరచటం కోసం ఇలా పార్టీలు నానా అగచాట్లు పడుతున్నాయి. అయితే ఈ సమస్యకు నిజాయతీతో కూడిన పరిష్కారం అధికార వికేంద్రీకరణ. స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉంటే వేలమంది సమర్థులు తమ నాయకత్వాన్ని రుజువు చేసుకోవటానికి, రాజకీయంగా బలపడటానికి, ప్రజలలో మంచిపేరు తెచ్చుకోవటానికి, ఆ ప్రభుత్వాలలో అవకాశముంటుంది. నాలుగోది : ప్రస్తుతం తెలంగాణా ప్రాంత ప్రజల మనోభావాలు, ప్రత్యేక రాష్ట్ర నినాదం ఈ ఎన్నికల తీరును ప్రభావితం చేస్తాయి. ప్రత్యేక రాష్ట్రం వచ్చేది, లేనిది భవిష్యత్ రాజకీయాలు, జాతీయ స్థాయిలో విధానాలు నిర్ణయిస్తాయి. అయితే ఈ లోగా వెనకబడ్డ ప్రాంతాల ప్రజల్లో తమ జీవితాల మీద తమకు సర్వాధికారాలున్నయన్న విశ్వాసాన్ని కలిగించాలి. అందుకు సబబైన, నిజాయితీతో కూడిన మార్గం అధికార వికేంద్రీకరణ.

## మనసుంటే మార్గం

ఈ రాజకీయ కారణాల దృష్ట్యా అన్ని పార్టీలు వెంటనే అధికార వికేంద్రీకరణను, స్థానిక ప్రభుత్వాల సాధికారతను ప్రస్తుత ఎన్నికలలో నిర్ణయాత్మక అంశంగా ప్రజల ముందుకు తేవటం అవసరం. శాసనసభ రద్దయింది. కాబట్టి సాధికారత కోసం చట్టాలను చేసే అవకాశం ప్రస్తుతానికి లేదని రాష్ట్రప్రభుత్వం ఈ అంశాన్ని దాటవేయవచ్చు. కాని మనసుంటే మార్గాలు ఉంటాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెండు పనులను చేయాలి. మొదటిది : తమ తదుపరి బడ్జెట్‌లో ప్రతి శాఖకు, ప్రతి పద్దు కింద జిల్లాల వారీగా కేటాయింపులెలా ఉంటాయో చూపాలి. ఆ కేటాయింపుల మీద స్థానిక ప్రభుత్వాలకు పూర్తి ఆజమాయిషీని, విచక్షణాధికారాన్ని ఇవ్వాలి. ఇది పూర్తిగా ప్రభుత్వం చేతుల్లో పని రెండవది: నిర్దిష్టంగా ఏయే బాధ్యతలను ఏ విధంగా, ఎంత మేరకు, ఏయే వనరులతో స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయబోతున్నారో తెలియజేస్తూ శ్వేతపత్రం రూపంలో సవివర విధాన ప్రకటన విడుదల చేయాలి. ఈ రెండు చర్యలు ప్రభుత్వ చిత్తశుద్ధికి గీటురాళ్లవుతాయి. వాటిని బట్టి ప్రజలు తీర్పు ఇస్తారు. ◆

# ఆర్థిక ప్రగతికి రాజకీయ సంస్కరణలు

## ప్రస్తుత ఎన్నికల వ్యవస్థతోనే అనర్థాలు

ఆకాశమే హద్దుగా చైనా సాధిస్తున్న అభివృద్ధి అంతర్జాతీయ సమాజంలో ఇటీవల పెద్ద చర్చనీయాంశంగా మారింది. చైనా, భారత్‌ల మధ్య ప్రగతి తీరులో ఉన్న తేడాలను విశ్లేషించడం చాలామంది ఆర్థికవేత్తలకు ఆసక్తికరమైన వ్యాసంగం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థల్లో వేగవంతమైన వృద్ధిరేట్లతో ముందుకు దూసుకుపోతున్న దేశాలివి. చైనా వృద్ధిరేటు ఏడాదికి తొమ్మిది లేదా అంతకు కొంచెం ఎక్కువగా ఉంటే– భారత్ వృద్ధిరేటు మాత్రం గడచిన రెండు దశాబ్దాల్లో ఆరుశాతాన్ని మించలేదు. ఈ తేడా ఫలితంగా చైనా ఆర్థికం ప్రతి ఎనిమిదేళ్లకోమారు రెండింతలవుతుంటే, భారత్ ఆర్థికవ్యవస్థ మాత్రం పన్నెండేళ్లకోమారుగానీ ఆ స్థితికి చేరుకోలేకపోతోంది. ఏదిఏమైనా– ప్రజల కొనుగోలు శక్తిని ప్రాతిపదికగా తీసుకుంటే చైనా, భారత్‌లు ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థలుగా నిలుస్తున్నాయి. ఏడో దశకంలో ఈ రెండు దేశాలు దాదాపుగా ఒకే స్థాయినుంచి తమ ప్రగతి ప్రస్థానాన్ని ప్రారంభించాయి. ప్రస్తుతం చైనా తలసరి ఆదాయంలో సగాన్ని మాత్రమే భారత్ సాధించగలిగింది. 1980లో ఇరుదేశాల ఎగుమతులు ఇంచుమించుగా ఒకేస్థాయిలో ఉండేవి. కానీ నేడు ప్రపంచ ఎగుమతుల్లో చైనా వాటా భారత్‌తో పోలిస్తే నాలుగింతలకు పెరిగింది. మరోవైపు భారత్ జనాభా ఏడాదికి 1.9 శాతం చొప్పున పెరుగుతూనే ఉంది. జనాభా వృద్ధిని చైనా సమర్థంగానే కట్టడిచేస్తోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తలసరి ఆదాయం విషయంలో భారత్, చైనాల మధ్య తేడా అంతకంతకూ పెరుగుతోంది. ఈ వాస్తవాల నేపథ్యంలో తన శక్తి సామర్థ్యాలను కూడదీసుకొని, గట్టి కృషిచేస్తే తప్ప ఆర్థిక రంగంలో చైనాను ధీటుగా ఎదుర్కోవడం భారత్‌కు సాధ్యం కాదు.

## తేడా సుస్పష్టం

రెండు దేశాల్లోని ప్రగతి రీతులను పరిశీలిస్తే కొన్ని ఆసక్తికరమైన వాస్తవాలు బోధపడతాయి. భారత్‌లోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాలు దేశ ప్రగతికి చుక్కానిగా నిలుస్తున్నాయి. ఉత్తర, తూర్పు ప్రాంతాలు దేశ ప్రగతి ప్రక్రియలో క్రియాశీలంగా


లేవు. చైనాలోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. ఆ దేశంలోని దక్షిణ, తూర్పు భాగాలు, పసిఫిక్ చుట్టూ ఉన్న ప్రాంతం చైనా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. చైనాలో విస్తారంగా ఉన్న పశ్చిమప్రాంతం ఎలాంటి పురోగతి లేకుండా అచేతనంగా ఉంది. భారత్‌లో మాదిరిగానే లక్షల మంది గ్రామీణుల ఉపాధికోసం పట్టణాలకు తరలడం చైనాలోనూ కనిపిస్తుంది. ఈ వలసలు చైనా సర్కారుకు సవాలుగా నిలుస్తున్నాయి. నిరంకుశపాలన వ్యవస్థ, అన్ని స్థాయిలపై కచ్చితమైన ప్రభుత్వ అజమాయిషీ ఉండటంవల్ల చైనా నగర ప్రాంతాల్లో మురికివాడలు, దుర్భర దారిద్ర్యం కనిపించవు. చైనా సర్కారు ఏర్పాటు చేసిన పట్టణ, గ్రామీణ వాణిజ్య వ్యవస్థలు- గ్రామీణ ప్రాంతాలకూ, చిన్న చిన్న పట్టణాలకూ ఊరటగా నిలుస్తున్నాయి. నూతన ఉద్యోగాల సృష్టి, ఉపాధి కల్పనలమీద ఈ వ్యవస్థలు ప్రధానంగా దృష్టినిలపడం వల్ల మంచి ఫలితాలే సాకారమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి దిశగా మళ్ళించి, నూతన ఉద్యోగావకాశాలను కల్పించాలంటే భారత్ చేయాల్సింది. ఎంతో ఉంది. ప్రాంతీయ అసమానతలకు సంబంధించి ఇరుదేశాల నడుమ ఓ తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. చైనాలోని సుమారు 93 శాతం జనాభా తూర్పు, మధ్య ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉంది. ఇక్కడి వృద్ధిరేట్లలో అక్కడక్కడా అసమానతలు కనిపించినా- మొత్తం మీద చైనాలోని తూర్పు, మధ్య భాగాలు ప్రగతి దిశగా ఎంతో వేగంగా ప్రస్థావిస్తున్నాయి. ఆర్థికపరమైన వెనుకబాటుతనం అనేది చైనాలో పదిశాతం కంటే తక్కువ జనాభాకే పరిమితమైంది. భారత్ పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఈశాన్య ప్రాంతాల్లో దాదాపుగా దేశంలోని సగం జనాభా కేంద్రీకృతమై ఉంది. చాలా వరకు ఈ రాష్ట్రాలన్నీ దేశాభివృద్ధి క్రమంలో (పశ్చిమ యు.పి, రాజస్థాన్‌లోని జాతీయ రాజధాని ప్రాంతం వంటివి ఇందుకు మినహాయింపులు) కీలకపాత్ర పోషించడంలో విఫలమవుతున్నాయి. ఉదాహరణకు దేశంలోని అతి సంపన్న రాష్ట్రమైన మహారాష్ట్ర తలసరి ఆదాయం- బీహార్‌తో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. ఈ తేడా అంతకంతకూ పెరుగుతోంది కూడా. విస్తీర్ణంపరంగా ఉత్తరాది రాష్ట్రాలు చాలా పెద్దవి. దేశంలో ఈ రాష్ట్రాల జనాభా ఓవైపు పెరుగుతుంటే... మరోవంక స్థూల దేశీయోత్పత్తిలో వీటి వాటా మాత్రం అంతకంతకూ క్షీణిస్తున్న పరిస్థితి నేడు మన

ముందుంది. దేశంలోని పశ్చిమ, దక్షిణ భాగాల స్థాయిలోనే ఈ ప్రాంతాలూ అభివృద్ధిని సాధించగలిగిననాడు ఆసియాలో అమోఘమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ వన్నెలీనడం ఖాయం. ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల పరిస్థితినే తీసుకుంటే ఈ రెండు రాష్ట్రాల్లోనూ పాలనావ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందన్నది నిజం. ఈ ప్రాంతాలను పీడిస్తున్న దీర్ఘకాలిక సమస్య ఇది. గడచిన మూడున్నర దశాబ్దాలుగా ఈ రాష్ట్రాలను పాలిస్తున్న అన్ని పార్టీలకూ ఈ పాపంలో భాగం ఉంది. అసమర్థత, దుష్పరిపాలన, పాలనలో విలువల క్షీణత, మౌలిక సదుపాయాల వ్యవస్థ కుప్పకూలిపోవడం వంటి లోపాలన్నింటికీ రాజకీయ వ్యవస్థనే తప్పుపట్టాల్సి ఉంటుంది. అడ్డంకులను అధిగమించి బీహార్, యు.పి.లను అభివృద్ధి బాట పట్టించాలంటే సమగ్రమైన జాతీయ వ్యూహాన్ని రచించక తప్పదు. అంతటి వివేకాన్ని మన రాజకీయ పార్టీలు కనబరుస్తాయా అన్నదే ప్రశ్న. అధికారం కోసం పరస్పరం కుమ్ములాడుకుంటున్న పార్టీలు– అభివృద్ధి సాధనకోసం కలిసికట్టుగా వ్యూహాలను రూపొందించాలన్న విషయాన్ని బొత్తిగా మరచిపోయాయి. ఏదిఏమైనా అలాంటి ప్రయత్నమైతే మొదలుకావాలి. లేకపోతే అభివృద్ధి విషయంలో అంతర్జాతీయంగా భారత్ బాగా వెనకబడిపోతుంది. ప్రగతిపథంలో బీహార్,యు.పి.లు అచేతనంగా మారితే... భారత్ పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఉండదనడంలో సందేహం లేదు. దేశంలో నెలకొన్న రాజకీయ సంక్షోభం తొలగిపోయి. ప్రజాస్వామ్యం పరిణతిని సంతరించుకోవడానికి మరికొంతకాలం పడుతుంది. రాజకీయ చిత్త శుద్ధి, దృఢమైన నాయకత్వంతోనే అది సాధ్యం. చైనా, ఆగ్నేయాసియాలు అభివృద్ధిని సాధిస్తున్న తీరు భారత్‌కు మంచి పాఠంగా ఉపయోగపడుతుంది. సుదీర్ఘకాలంగా పట్టుకు వేళ్ళాడిన సంకుచిత దృక్పథానికి నీళ్లొదిలి– క్రితం దశాబ్దంలో భారత విధాన కర్తలు రెండు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. మొదటిది : ఆర్థిక ప్రయోజనాలను సిద్ధింపజేసుకోవాలన్న లక్ష్యంతో దౌత్యపరంగా, భౌగోళిక, రాజకీయపరంగా భారత్ వ్యూహాత్మకంగా ముందడుగు వేయడం. రెండోది : 'లుక్ ఈస్ట్' విధానానికి శ్రీకారం చుట్టి, ఆగ్నేయాసియా, చైనా ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానాన్ని ఆరంభించడం. ఈ చర్యల వల్ల ఫలితం చెప్పుకోదగిన స్థాయిలోనే ఉంటుంది. ఇరుపక్షాలకూ ఉపయోగకారిగా ఉండే ఈ విధానాలను మరింత వేగంగా, స్ఫూర్తివంతంగా ఆచరణలో పెట్టాల్సిన అవసరం మాత్రం తొసిపుచ్చలేనిది.

## కొత్త మార్గంతో సిరుల పంట!

మణిపూర్‌లోని మోరె మొదలు థాయ్‌లాండ్‌లోని మె సాట్ మీదుగా మియన్మార్‌లోని బెగాన్‌వరకూ 1360 కిలోమీటర్ల మేర నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ రహదారిమార్గం ఎన్నెన్నో వాణిజ్య ప్రయోజనాలను ఆవిష్కరించనుంది. ఈ ప్రాంతంలోని అన్ని దేశాలకూ అది సిరులపంటను పండించనుంది. బర్మా, థాయ్‌లాండ్‌లతో మనకు రహదారిమార్గం ఏర్పడితే– చైనాలోని యున్నాన్ ప్రాంతంతో భారత్ నేరుగా వాణిజ్య లావాదేవీలను నెరపవచ్చు. భారత్‌లోని ఉత్తర, ఈశాన్య ప్రాంతాలకు నైరుతి చైనాతో ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. ఈ వాణిజ్య సంబంధాలవల్ల, ఈ ప్రాంతాల ప్రజలు ఒకచోట నుంచి మరోచోటికి స్వేచ్ఛగా సంచరించే అవకాశం ఏర్పడటం వల్ల– మొత్తంగా అన్ని దేశాలూ లాభపడతాయి. అభివృద్ధిపరంగా నిర్లక్ష్యానికి గురై, బాగా వెనుకబడిన ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు యు.పి., బీహార్, ఒరిస్సా, చత్తీస్‌గఢ్‌లు ఆర్థిక లావాదేవీలకు ప్రధాన కేంద్రాలుగా అవతరిస్తాయి. చైనా, ఆగ్నేయాసియాలకు విస్తారమైన భారతీయ మార్కెట్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడుతాయి. పశ్చిమ బెంగాల్, కోల్‌కత్తా ఉజ్వల గతం పునఃసాక్ష్యాత్కారమవుతుంది. అమేయ శక్తితో దూసుకుపోతున్న ఆగ్నేయాసియా దేశాలతో నేరుగా సంబంధాలు పెరగడం వల్ల భారత్‌లోని తూర్పు ప్రాంతం పురోగామి అవుతుంది. నిండా అవినీతిలో మునిగి, స్వయం ప్రకాశాన్ని దాదాపుగా కోల్పోయి– కేంద్రం ఇస్తున్న సబ్సిడీలమీద పూర్తిగా ఆధారపడిన ఈశాన్య ప్రాంతంలో పర్యాటక రంగం వృద్ధిచెంది ఆర్థికవ్యవస్థ కొత్త పుంతలు తొక్కుతుంది. తిరుగులేని రీతిలో పురోగమిస్తున్న చైనా వేగాన్ని అందుకోవాలంటే పక్కా వ్యూహంతో భారత్ ముందుకు కదలాల్సి ఉంటుంది. కచ్చితమైన అవగాహనతో విధానాల మధ్య సరైన సమన్వయాన్ని సాధిస్తూ మన శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ సాగాలి. థాయ్‌లాండ్‌తోనూ, చైనాలోని యున్నాన్ ప్రాంతంతోనూ రహదారి మార్గాలను అభివృద్ధి చేసుకోగలిగితే– అది యు.పి.ఎ. సర్కారుకైనా, విపక్షంలోని ఎన్.డి.ఎ.కైనా ఎంతో ప్రతిష్ఠను కొనితెస్తుంది. అత్యవసర పరిస్థితులు, హింసాకాండల స్థానే ఈశాన్య ప్రాంతం ఇబ్బడిముబ్బడి ఉద్యోగాలు, చాలినంత సంపదతో తేజరిల్లుతుంది. ఆర్థిక శక్తికేంద్రంగా పశ్చిమబెంగాల్ స్థాయి పునరుజ్జీవితమైతే దానివల్ల మార్క్సిస్టులకు

ఒనగూడే లాభం అపారమైంది. బీహార్, తూర్పు యు.పి.లకు లాలూ, ములాయంలు ఎట్టకేలకు అభివృద్ధిని రుచి చూపించిన వారవుతారు. దుర్భర దారిద్ర్యం నుంచి ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలను ఒడ్డునపడేసిన ఘనత కాంగ్రెస్ దక్కించుకోగలుగుతుంది. తాము ఆరంభించిన విధానాలు సత్ఫలితాలు ఇచ్చాయని ఎన్.డి.ఎ. ఘనంగా చాటుకోవచ్చు ఆర్థిక ప్రగతికి రాజకీయ సంస్కరణలకు.. తద్వారా బీహార్, యు.పి.లలో ఉత్తమ పాలనకు తొలి అడుగులు పడతాయి. అట్టడుగు నుంచి ఆకాశానికి చేరుకుని ఆసియా ఆర్థిక దిగ్గజాల స్థాయిని భారత్ అందుకోగలుగుతుంది. ఈ కలలన్నీ నిజం కావాలంటే ఈర్ష్యాసూయలను, స్వార్థ రాజకీయ కాంక్షలను పక్కనపెట్టి పురోగమించాల్సి ఉంటుంది. ఆధునిక ప్రపంచాన్ని ఆర్థిక శక్తులే నడుపుతున్నాయి గానీ... సైనిక శక్తి కాదు. ఈ నేపథ్యంలో– మన విధాన కర్త వ్యూహాత్మక నిపుణులు ఆచరణాత్మకంగా స్పందించాలి. మనముందున్న అవకాశాలన్నీ ఆవిరి గాక ముందే మేల్కొని దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. ◆



**మా గ్రామంలో కూడా సిటీలాగే నీళ్ళు, కరెంటు వుండటం లేదయ్యా**

# డా॥ జయప్రకాష్ నారాయణ్



డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ (జె.పి) లోక్‌సత్తా ఉద్యమ వ్యవస్థాపకులు. డాక్టర్ చదివి ఐ.ఎ.ఎస్ అధికారిగా మారి సుమారు 16 ఏళ్లపాటు అనేక హోదాలలో పనిచేసి ఒక క్రియాశీలక సివిల్ సర్వెంట్‌గా, విప్లవాత్మక సంస్కర్తగా విశేష గుర్తింపును పొందారు. ఎన్నికల రాజకీయాల్ని, పరిపాలనను, ప్రజాజీవనంలోని మౌలిక రంగాలలో కీలక మార్పులు తెచ్చి పుట్టుకతో వివక్షలేని సమాజాన్ని సృష్టించాలనే తన నిరంతర స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు 1996లో ఐ.ఎ.ఎస్‌కి రాజీనామా చేసి ప్రముఖ సమాజసేవకులతో, పౌరులతో కలిసి లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించారు. అచిరకాలంలోనే లోక్‌సత్తా భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్కరణల కోసం జరుగుతున్న ఒక ప్రజాఉద్యమంగా రూపుదిద్దుకుంది. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు తమ వివరాలను బైటపెట్టటం, పార్టీలకు విరాళంగా ఇచ్చే నిజాయతీ డబ్బుకు పన్ను వెసులుబాటు కల్పించి మంచి రాజకీయానికి పునాది వేయటం, రాజకీయాలలో నేరచరితులను బైట పెట్టటం, ఓటరు రిజిస్ట్రేషన్‌ను గణనీయంగా మెరుగుపరచటం, పార్టీల ఫిరాయింపు నిబంధనల్ని కట్టడి చేయటం, పౌరసేవలు సకాలంలో అందేలా సిటిజన్స్ ఛార్టర్లను మొదలుపెట్టటం, సహకార సంఘాలను బలోపేతం చేయటం, గ్రామన్యాయాలయాల ఏర్పాటుకు పునాది, ప్రత్యామ్నాయ మహిళాబిల్లు రూపకల్పనవంటివి లోక్‌సత్తా ఉద్యమసంస్థ నభూతో అనేస్థాయిలో సాధించిన కొన్ని విజయాలు.

భారత ప్రధానమంత్రి నియమించిన జాతీయ సలహామండలిలో సభ్యునిగా కూడా జె.పి సేవలందించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే పాలనా సమాచార హక్కు (ఆర్.టి.ఐ) రూపకల్పన, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్.ఆర్.హెచ్.ఎం), సహకార సంఘాల బలోపేతానికి పునాది వేయటం వంటివి సలహా మండలి సభ్యునిగానే జె.పి సాధించారు. భారతదేశ రెండవ పరిపాలనా సంస్కరణల సంఘం సభ్యునిగా (కేంద్ర సహాయమంత్రి హోదా) కూడా దేశానికి జె.పి ఎనలేని సేవలందించారు. దేశ స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చేందుకు కావలసిన మౌలికమైన పాలనా సంస్కరణలను ఆయన ఈ సంఘంలో సభ్యునిగా రూపొందించారు.

2009లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ కూకట్‌పల్లి నుంచి ఎం.ఎల్.ఏగా జె.పి ఎన్నికయ్యారు. కొత్త రాజకీయ సంస్కృతితో ఎన్నికై 'ఆదర్శ శాసనసభ్యునిగా' విస్తృత గుర్తింపును పొందారు. ప్రజాప్రతినిధిగా మైలురాళ్లలాంటి మార్పుల కోసం జె.పి పోరాడుతున్నారు. పౌరులకు ప్రభుత్వ సేవలు ఒక హక్కుగా అందించేందుకు, అవినీతి నిరోధానికి బలమైన వ్యవస్థల్ని ఏర్పాటు చేసేందుకు, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతను అందించేందుకు, న్యాయ సంస్కరణలకు, వ్యవసాయ సంస్కరణలకు, స్వేచ్ఛామార్కెట్‌లకు, మంచి చదువును అందించేందుకు విద్యారంగం సంస్కరణలకు, ఉద్యోగావకాశాలకు, అందరికీ నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించేందుకు, నిరుపేదలకు సామాజిక భద్రతను కల్పించేందుకు జె.పి లోతైన కృషి చేస్తున్నారు. లక్ష్యాల సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా తన కృషిని విస్తరించి పనిచేస్తున్న జె.పి.. ఒక జాతీయస్థాయి నేతగా, యువతకు ఒక రోల్ మోడల్‌గా విశేష ప్రాచుర్యం పొందారు. స్వచ్ఛమైన రాజకీయాలను, సుపరిపాలనను ఆచరణలో చూపుతూ వాటికి ఛాంపియన్‌గా, సంకేతంగా, చెరగని చిరునామాగా జె.పి సర్వత్రా పేరుగాంచారు.